# జీవనోపాధులు

... భవితవ్యం

**మే 2016**



# బి.ఆర్. అంబేద్కర్

సహకరించే హస్తాలు ! – 7

**మే** *దే శుభాకాంక్షలు!*

*మాతృత్వ దినోత్సవ శుభాకాంక్షలు!*

*రవీంద్రనాథ్ ఠాగూర్‌ను, ఆయన 'గీతాంజలి'ని స్మరించుకుందాం!*

*బుద్ధుని స్మరించుకుందాం!*

భారతదేశం అన్నది ఒక దీర్ఘకాలిక స్వప్నం. 1947 నుంచి మన దేశం భౌతికంగా ఒక సార్వభౌమ దేశంగా ఎలా తయారయ్యిందీ మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఇందుకోసం భారత ప్రజలకు రాజ్యాంగం రూపంలో ఒక మార్గదర్శక పత్రం అవసరమైంది. ఈ పత్రం రాజ్యాంగ సభ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ద్వారా స్థూలంగా రూపుదిద్దుకుంది. ఈ రాజ్యాంగం 1950, జనవరి 26 నుంచి మనకు మార్గదర్శిగా ఉంది. బి.ఆర్. అంబేద్కర్ ఆ తర్వాత దేశ న్యాయశాఖ మంత్రిగా తన సేవలు అందించారు. ఆయన మహానిర్వాణం జరిగిన 50 ఏళ్ల తర్వాత, తిరిగి నేడు ఆయన సమాజానికి ఎంతో అవసరమనిపించే సందర్భం కనిపిస్తోంది. ఆయనను ఆధునిక భారతదేశ నిర్మాతగా భావిస్తున్నారు. దేశంలోని అణగారిన వర్గాల ప్రజలకు, మరీ ప్రత్యేకించి ఎస్సీలకు ఆయన ఒక స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శకుడు. ఈ ప్రపంచంలో మానవత్వానికి ఆయన దిక్సూచి. ఈ నేపథ్యంలో 'జీవనోపాధులు' 'బి.ఆర్. అంబేద్కర్' అన్న ఒక అసాధారణ వ్యక్తిత్వాన్ని పరిశీలించే ప్రయత్నం చేసింది.

దయచేసి గెయిల్ ఓమ్‌వెట్ రచించిన 'అండర్‌స్టాండింగ్ కాస్ట్: ఫ్రమ్ బుద్ధ టు అంబేద్కర్ అండ్‌బియాండ్' అన్న పుస్తకాన్ని చదవండి.

ఎప్పటిలాగే ఈ-లింక్స్‌లో 'VCA – ఆర్టిజినల్ ఫిషరీస్'; ఉపరంగంలో తేనె గురించి; ఈ-బుక్ లో 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్: ద మేకర్ ఆఫ్ మాడర్న్ ఇండియా'; వీ-బుక్‌లో 'జోహార్ బస్తర్- గ్రామీణాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు చూపిన దారి'ని ఇవ్వడం జరిగింది.

ఈ నెల అనుబంధంలో బృహత్ ప్రయత్నం కింద 'విద్యా హక్కు'ను, క్షేత్రం కింద 'దక్కన్ పీఠభూమి'ని; జీవనోపాధుల నిర్వహణా నోట్స్ కింద 'పతాక పథకములు' ఇవ్వడం జరిగింది.

ఈ ప్రత్యేక సంచిక మీకు ఉపయుక్తంగా ఉంటుందని విశ్వసిస్తూ...

మీ 'జీవనోపాధులు' బృందం.

**ప్రపంచవ్యాప్తంగా 125 మిలియన్ల ప్రజల కంటే ఎక్కువ మందికి మానవత సహాయం అవసరం ఉంది. 2016 సం॥రంలో అణగారిన వర్గాల కోసం సమిష్టి మరియు సహకార చర్యల ద్వారా 87.6 మిలియన్ల ప్రజలకు సహాయ సంస్థలు తక్షణ సహాయం అందించారు. దీనికి 20.1 మిలియన్ల డాలర్ల నిధులు అవసరం ఉంది.**

**(మూలం: UN నివేదిక, డిసెంబర్ 2015)**




**నిరంతర ప్రయత్నాలు ఉత్తమ ఫలితాలను సాధిస్తాయి.**

**ఈ నెల జీవనోపాధులు, అనుబంధాలు మరియు ఈ-కోర్సు**









జీవనోపాధులు ... భవితవ్యం


ఎడిటర్ ఇన్ చీఫ్ : జి. మురళీధర్
సీనియర్ ఎడిటర్ : టి. వెంకటేశ్వర్లు
వర్కింగ్ ఎడిటర్ : యస్.లక్ష్మణ్
సంపాదక సాహచర్యం : వి. అరవింద్
: కె. ఛాయా దేవి
: కె. రమేష్

**మాతో/మాదారిలో**

ఎ. ఉమ
జి. జానకి
జి. దయానంద్
వి. దీప్తి
కె. భారతి
బి. మధుసూదన్
పి. మధుసూదన్
కె. మంజుల
కె. కృష్ణ చైతన్య
వి. మురళీధర్
టి. నిర్మల
సి. రమేష్
ఎం. రవికృష్ణ
జి. రవిందర్
ఎం. లావణ్య
ఎ. వెంకట రమణ
కె. శ్రీదేవి
ఎం. సుగుణశ్రీ

**ప్రైవేట్ సర్క్యులేషన్ కోసం మాత్రమే**

**అక్షర లైవ్లీహుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ALPL)**
**సహకారంతో**



Contact:
Mobile: 9885499297
web: www.aksharakriti.org,
www.livelihoods.net.in
e-mail: akshara@aksharakriti.org,
jeevanopadhulu@gmail.com

**చిరునామా**
C/o. Akshara Network
for Development Support Services
HIG - II, B-12, F - 1, APHB కాలనీ
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044


## ఈ సంచికలో...


**ప్రత్యేకం**

**ఫోకస్: బి. ఆర్. అంబేద్కర్** 11

నెలనెలా..

సంపాదకీయం 2
స్పందన మరియు న్యూస్ 4
జాతీయ వార్తలు 5
క్షేత్రం - **అండమాన్, నికోబార్ ఐలాండ్స్** 6
సుక్షేత్రం - **జేను కురుబ**
మథనం - **సహకరించే హస్తాలు !** 7
సంభాషణ - **ఆమ్‌ఆద్మీ, నిస్సహాయులు, కమ్యూనిటీ లీడర్, క్షేత్రస్థాయి కార్యకర్త** 8
అభివృద్ధి కార్యకర్త సంభాషణ 10
జీవన తంత్రం - **మారిన మల్లయ్య...** 21
పుస్తకాలు - క్లాసిక్ పుస్తకం : **అండర్‌స్టాండింగ్ క్యాస్ట్** 22
లేటెస్ట్ పుస్తకం : **ద మేకర్ ఆఫ్ మోడ్రన్ ఇండియా**
లేటెస్ట్ పుస్తకం : **అంబేద్కర్ యాన్ ఎకనామిస్ట్ ఎక్స్‌ట్రార్డినైర్**
'యోగ'క్షేమం 23

**ఈ-వనరులు:** 22
**విలువ గొలుసు విశ్లేషణ** : ఆర్టిజనల్ ఫిషరీస్ ఇన్ మారిషస్
**ఉపరంగం** : హనీ ఇన్ మాలవి
**పుస్తకం** : డా॥ బి.ఆర్. అంబేద్కర్: ద మేకర్ ఆఫ్ మోడ్రన్ ఇండియా
**వీడియో** : జోహర్ బస్తర్ - సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ పేవింగ్ ద వే టు రూరల్ డెవలప్‌మెంట్

బృహత్ ప్రయత్నం : విద్యా హక్కు
క్షేత్రం : దక్కన్ పీఠభూమి
లైవ్లీహుడ్ మేనేజ్‌మెంట్ నోట్స్ : పతాక పథకాలు (ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్)

ఈ-లైవ్లీహుడ్స్ లెర్నింగ్ కోర్స్ : క్యాప్సుల్ నెం: **278 - 294**



గమనిక: ఇందులో ప్రచురించిన రచనల్లోని అభిప్రాయాలు ఆయా రచయితలవి. వాటిని పత్రిక అభిప్రాయాలుగా భావించకూడదు.

# స్పందన




ఏప్రిల్ జీవనోపాధుల పత్రికలో 'కరువు' అనే ప్రత్యేక సంచిక చాలా బాగుంది. మీ బృందానికి ధన్యవాదములు.

రవి పూరేటి,
హైదరాబాద్



'స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం (SVEP)' ద్వారా గ్రామీణ ఔత్సాహిక వ్యాపారులందరూ ఆర్థిక మద్ధతును పొందగలరా?

## ➤➤ న్యూస్ ➤➤

**✠ గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం:**
గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఔత్సాహిక గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, సబ్సిడీలను త్వరగా విడుదల చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజనాభివృద్ధి, సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. గిరిజన తండాలకు రోడ్ల సౌకర్యం కల్పించేందుకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.230 కోట్లు ఖర్చు పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలను మెరుగు పరిచేందుకు రూ.145 కోట్లను ఖర్చు చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

**✠ సమగ్ర కుటుంబ సర్వేకు అరుదైన గుర్తింపు:**
తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేకు అరుదైన గుర్తింపు లభించింది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు జాతీయ రికార్డుగా గుర్తించింది. ఈ మేరకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి ధృవీకరణ పత్రాన్ని పంపింది.

**✠ మత్స్య, గొర్లకాపర్లకు ఎక్స్‌గ్రేషియా పెంపు:**
ప్రమాదాల్లో మరణించిన మత్స్య గొర్ల కాపరుల కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను లక్ష నుంచి ఐదు లక్షలకు పెంచడానికి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడీ పరిశ్రమలశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు.

**✠ కేంద్ర పథకాలను 26.08 కోట్లు విడుదల:**
కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్మార్ట్ సిటీస్, అమృత్, JNNURM లాంటి పథకాలకు సంబంధించిన పనుల కోసం రూ.26.08 కోట్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. అమృత్ పథకం కోసం రూ.2.75 కోట్లను వినియోగించాల్సి ఉంటుంది. అదేవిధంగా స్మార్ట్‌సిటీల కోసం రూ. 1 కోటి, JNNURMకు గాను రూ.22.258 కోట్లను వినియోగించాల్సి ఉంది.

**✠ తెలంగాణ పల్లెప్రగతికి 10 కోట్లు విడుదల:**
గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో చేపడుతున్న తెలంగాణ పల్లెప్రగతి పథకం నిర్వాహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన 150 మండలాల్లో ప్రపంచబ్యాంకు ఆర్థిక సహకారంతో రాబోయే ఐదేండ్లలో గ్రామీణాభివృద్ధిశాఖ చేపడుతున్న ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.190 కోట్లు ఖర్చు పెడుతున్నది అందులో మొదటి త్రైమాసికం కింద ఈ నిధులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ వ్యయం నుంచి ఈ నిధులను విడుదల చేసింది.

**✠ 2019 నాటికి 53 లక్షల మరుగుదొడ్లు:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2019 నాటికి 53 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్తున్నట్లు ఆ రాష్ట్ర శాసనసభాపతి తెలిపారు. ఏడాదికి ఎన్ని పూర్తి చేయాలి, మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం పెంపు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**✠ ఆంధ్రప్రదేశ్‌లో చిల్లర వర్తకులకు ఊరట:**
ఆంధ్రప్రదేశ్‌లో చిల్లర వర్తకులకు ఊరటనిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఐదేళ్ళపాటు ఏడాది పొడువునా దుకాణాలు తెరిచి ఉంచు కొనేందుకు అనుమతి కల్పించింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దుకాణాలు తెరచి ఉంచుకొనేందుకు అవకాశాన్నిచ్చింది. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం 6 ప్రధాన సెక్షన్ల నుంచి మినహాయింపు కల్పించింది. దుకాణాలు, వాణిజ్య సంస్థలోని కార్మికులకు ఈ నిబంధనలు వర్తింపజేయాలని ఉత్తర్వులో పేర్కొంది. వారాంతపు సెలవులు, పనివేళలు, అదనపు పనికి వేతనం అమలు చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది.

(మూలం: ఈనాడు, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ) ✸

# జాతీయ వార్తలు

**✠ పేదలకు ఉచితంగా విద్యుత్:**

దేశంలోని పేద ప్రజలందరికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్‌ను అందిస్తాం. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న ప్రజలు విద్యుత్ కనెక్షన్ తీసుకుంటే ఆ మొత్తాన్ని ఐదేండ్లపాటు నెలసరీ వాయిదాల్లో చెల్లించే విధంగా వెసులుబాటు కల్పిస్తామని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి చెప్పారు. ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం త్వరలోనే నూతన విధానానికి శ్రీకారం చుట్టనున్నదని, దరఖాస్తు చేసుకున్న వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం సమర్పించే దరఖాస్తు ఫారాన్ని చాలా సులభంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆ తర్వాత విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోమని ప్రజలకు విజ్ఞప్తి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఆధార్ నెంబర్, ఈమెయిల్ అడ్రస్, చిరునామా, మొబైల్ నెంబర్, సంతకం వివరాలతోపాటు విద్యుత్ కనెక్షన్ అవసరముంది, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తామని తెలిపే దరఖాస్తు ఫారాన్ని ప్రజలకు అందజేయాలని అధికారులను కోరుతున్నామని తెలిపారు. 2018 మే 1 నాటికి 18452 గ్రామాలను విద్యుదీకరించాలని లక్ష్యంగా పెట్టుకొన్నామని, అయితే ఓ ఏడాది ముందుగానే అంటే 2017 మే 1 నాటికి ఆ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

**✠ చిన్న పరిశ్రమలకు త్వరలో కొత్త విధానం:**

దేశంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరు సంతృప్తికరంగా ఉందని, మొత్తం ఉత్పత్తిలో ఈ పరిశ్రమల వాటా సుమారు 45 శాతం ఉన్నదని పేర్కొన్న కేంద్ర మంత్రి ఈ సంవత్సరానికి సమగ్రమైన నూతన విధానాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. దేశం మొత్తం మీద ఎగుమతులు సుమారు ఒకటిన్నర ఏడాది నుంచి తగ్గుముఖం పడుతున్నా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి మాత్రం తగ్గలేదన్నారు. ఈ పరిశ్రమలన మరింతగా ప్రోత్సహించడంతోపాటు ప్రభుత్వరంగ సంస్థల ఆధీనంలోకి తీసుకురావడం, మూతపడిన పరిశ్రమలను తెరపించడానికి అవసరమైన చర్యలను చేపట్టడం తదితరాలన్నీ నూతన విధానంలో ఉంటాయని అన్నారు. రెండేళ్ళలో సాధించిన ప్రగతి గురించి మీడియాకు వివరించే సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరు సంతృప్తికరంగానే ఉన్నదని, మరింతగా ప్రోత్సాహించాలన్న ఉద్దేశ్యంతో సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని భావిస్తున్నామని, ఇందుకోసం త్వరలోనే ఒక కమిటీ ఏర్పాటవుతుందనీ తెలిపారు. కేంద్ర క్యాబినేట్ కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ నూతన విధాన ముసాయిదాను తయారుచేస్తుందనీ, అక్టోబర్ 31వ తేదీకల్లా నివేదిక తమకు అందుతుందని తెలిపారు.

**✠ పెరుగుతున్న సముద్ర మట్టాలు:**

2050 నాటికి సముద్ర మట్టాలు పెరగడం వల్ల సుమారు నాలుగుకోట్ల భారతీయులకు ప్రమాదం పొంచి ఉన్నది. ఆర్థికవృద్ధి, పట్టణీకరణ వేగంగా అభివృద్ధి కారణంగా భవిష్యత్‌లో సముద్ర తీరప్రాంతాలు ముందుకు చొచ్చుకొచ్చే అవకాశమున్నది. ఫలితంగా దేశంలో ముంబై, కోల్‌కతా ప్రజలకు గరిష్ఠ ప్రమాదం ఉంటుందని ఐక్యరాజ్యసమితి పర్యావరణ నివేదిక వెల్లడించింది. ప్రాంతీయ గణాంకాల ప్రకారం శీతోష్ణస్థితిలో మార్పు కారణంగా పసిఫిక్, దక్షిణ ఆగ్నేయాసియా ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా పసిఫిక్ మహాసముద్ర తీర పరిధిలో ఉన్న పది దేశాల్లో ఏడు దేశాలు తీవ్ర ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉంది. సముద్ర మట్టాలు పెరగడం మూలంగా భారతదేశంలో నాలుగు కోట్ల మందికి ప్రమాదం ఉంటుందని, అదేవిధంగా బంగ్లాదేశ్ 2.5కోట్లకు పైగా, చైనాలో 2 కోట్లకు పైగా, ఫిలిప్పీన్స్‌లో 1.5 కోట్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది.

**✠ ఆహార సబ్సిడీకి నగదు బదిలీ:**

వంటగ్యాస్‌కు అమలుచేసినట్లే ఆహార సబ్సిడీలకూ నగదు బదిలీ పథకం వర్తింపజేయాలని సూచించినట్లు కేంద్ర ఆహారం మరియు ప్రజా పంపిణీశాఖ మంత్రి చెప్పారు. ప్రతి రాష్ట్రంలోనూ ఎంపిక చేసిన కొన్ని జిల్లాల పరిధిలో ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేయనున్నట్లు అన్ని రాష్ట్రాల పౌరసరఫరాలశాఖ మంత్రుల సమావేశంలో చెప్పారు. పుదుచ్చేరిల్లో ప్రయోగాత్మకంగా చేస్తున్న విధానంలో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు.

**✠ అంగన్‌వాడీల పనితీరు పర్యవేక్షణకు సాఫ్ట్‌వేర్:**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహార సేవల పనితీరును పర్యవేక్షించేందుకు కేంద్రం సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభించింది. పిల్లలకు పంపిణీ చేసే ఆహారంలో పోషక విలువలు లోపిస్తే తెలుసుకొనేందుకు వీలుగా, దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల పూర్తి డాటాను పొందేందుకు రాపిడ్ రిపోర్టింగ్ సిస్టమ్ కూడా అందుబాటులో తెచ్చింది. బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రూపొందించిన కామన్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ సాయంతో సరైన సమయంలో పౌష్టికాహారం సరఫరా అవుతున్నదా? లేదా? తెలుస్తుంది. రెండు అప్లికేషన్లలో ఈ సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్‌వైజర్లతో అనుసంధానానికి కేంద్రం వారికి స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు పంపిణీ చేసింది. అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్‌వైజర్ రోజువారీగా తమ కార్యక్రమాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రయోగాత్మకంగా ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలో ప్రారంభించారు. భవిష్యత్‌లో దేశంలోని 162 జిల్లాల పరిధిలో గల 3.68 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెస్తారని భావిస్తున్నారు.

**✠ వర్షాభావంతోనే పప్పుల ధరలు పెరిగాయి:**

వర్షాభావ పరిస్థితులు, దిగుమతులు తగ్గడం వల్లే పప్పు ధాన్యాల ధరలను పెరిగాయని కేంద్ర ఆహారశాఖ మంత్రి తెలిపారు. ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. 226 లక్షల టన్నుల పప్పు ధాన్యాలు అవసరం ఉండగా కేవలం రూ.171 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయినట్లు తెలిపారు. పరిస్థితులను అదుపులో ఉంచడానికి కేంద్రం అదనపు నిల్వలు సమీకరించిందని అన్నారు.

**✠ జాతీయ స్థాయిలో ఆహార వ్యవస్థ:**

జాతీయ స్థాయిలో ఒక ఆహార వ్యవస్థ (నేషనల్ ఫుడ్ గ్రిడ్ – NFG)ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. గిరాకీకి తగ్గ రీతిలో విద్యుత్తు పంపిణీ కోసం 'పవర్ గ్రిడ్' ఎలా సేవలందిస్తోందో అదే రీతిలో ఇది పనిచేస్తుంది. కూరగాయలు, పండ్లు పుష్పలంగా లభ్యమయ్యే ప్రాంతం నుంచి, కొరత ఉన్న ప్రాంతానికి వాటిని సత్వరం రవాణా చేయడం ఈ వ్యవస్థ ప్రధానోద్దేశ్యం. ఆహార ఉత్పత్తుల్ని నిల్వచేసే గోదాములు శీతల గిడ్డంగుల అనుసంధానత కల్పించడం NFG సంస్థ పని. రాష్ట్రస్థాయి పరిధులతో సంస్థ పనిచేయనుంది. దేశంలో పాలు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాల్లో ప్రస్తుతం 10 శాతాన్నే దీర్ఘకాలిక అవసరాలకు వాడుతున్నారు. దీనిని 2019 నాటికి 20 శాతానికి పెంచాలనేది కేంద్రం యోచన. ✸

## అండమాన్, నికోబార్ దీవులు



అండమాన్, నికోబార్ దీవులు భారతదేశంలోని 7 కేంద్రపాలిత ప్రాంతాలలో ఒకటి. ఇది పూర్తిగా బంగాళాఖాతం మరియు అండమాన్ సముద్రంలో ఉన్నటువంటి దీవుల సమూహం. ఇది ఇండోనేషియాకు 150 కి.మీ॥ల (93 మైళ్ళు) దూరంలోను, థాయిలాండ్ మరియు మియన్మార్ వేరుచేస్తూ అండమాన్ సముద్రం ఉంది. ఈ దీవులు 10° అక్షాంశాలతో వేరు చేయబడి ఉన్నాయి. ఈ అక్షాంశానికి ఉత్తరంగా అండమాన్ దీవులు, దక్షిణంగా నికోబార్ దీవులు ఉన్నాయి. అండమాన్ దీవుల యొక్క ముఖ్య పట్టణం పోర్ట్‌బ్లేయర్. ఈ దీవులు 7,950 కి.మీ॥లు విస్తరించి ఉన్నాయి.

ఈ దీవులందు స్థానికంగా ఉండే ఆదిమ తెగలతో పాటు, బయటి ప్రాంతాల నుండి ఉపాధి కోసం వలస వచ్చిన వారితో ఇక్కడ మిశ్రమ ప్రజానీకంను కలిగి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం అండమాన్, నికోబార్ దీవుల జనాభా 3,79,944గా ఉండగా అందులో పురుషులు 2,02,330, స్త్రీలు 1,77,614లు ఉన్నారు. లింగ నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 878 స్త్రీలు కలరు. ఇట్టి జనాభాలో వివిధ రకాల మతస్థులు ఉన్నారు. ముఖ్యంగా 69% హిందువులు, 22% క్రిస్టియన్లు, 9% ముస్లింలు మరియు సిక్కులు ఉన్నారు.

ఈ దీవులలో హిందీ, ఇంగ్లీష్‌లతో పాటు ప్రాంతీయ భాషలు కూడా వాడుకలో ఉన్నాయి. ముఖ్యంగా 26% మంది బెంగాలీ భాషను, 12% తెలుగు, 18% తమిళం, 8% మళయాళం, 8% నికోబార్ భాషలను మాట్లాడుతున్నారు.

ఈ దీవులందు, 48,675 హెక్టార్ల భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. ప్రధానంగా వరిని ఆహార పంటగా పండిస్తున్నారు. అదేవిధంగా నికోబార్ దీవులందు కొబ్బరి, వక్క మరియు పలురకాలైన వాణిజ్య పంటలను పండిస్తున్నారు. అంతేగాకుండా పప్పుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, మామిడి, సపోట, బత్తాయి, అరటి, బొప్పాయి, అనాస వంటి పండ్ల తోటలను సాగుచేసున్నారు.

దీంతో పాటు సుగంధ ద్రవ్యాలైన మిరియాలు, వెల్లుల్లి, జాజికాయ, దాల్చిన చెక్క వంటి తోటలను కూడా సాగుచేస్తున్నారు. రబ్బరు, రెడ్ ఆయిల్, పామాయిల్, జీడిమామిడి వంటివి కూడా కొద్ది మొత్తంలో సాగుచేస్తున్నారు.

ఈ దీవులందు 1,374 గుర్తింపు పొందిన లఘ పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో చేతివృత్తుల పరిశ్రమలైన సంబంధ షెల్స్ (కర్పరాలు), అల్లికలు, కలప ఆధారిత ఉత్పత్తులు, చేపల ఎగుమతుల పరిశ్రమలు కలవు. వీటితో పాటు చిన్న పిండి మిల్లులు, సాఫ్ట్ డ్రింక్, బేవరేజెస్, బేకరి, రైస్ మిల్లులు, గృహోపకరణ తయారీ పరిశ్రమలు కలవు.

కొంతమంది స్థానిక గిరిజన/ఆదిమతెగలు నేటికి కూడా తమ సమూహాలతో కలిసి వేటాడడం, చేపల వేటను వంటి ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నారు.

ఈ దీవులు ప్రకృతి రమణీయతతో కూడిన సముద్రతీర ప్రాంతం పర్యావరణ హితంగా ఉండటంతో ఇక్కడి పర్యాటక రంగం పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తుంది. తద్వారా చాలా మంది ప్రజలకు జీవనోపాధిని కల్పిస్తుంది. ✸



## జేను కురుబ



జేను కురుబ ఆదిమతెగ కర్ణాటక రాష్ట్రంలో నివసించే ఆదిమ తెగలలో ఒకటి. ఇట్టి తెగ మొదటగా పశ్చిమ కనుమలలో నివసించేవారు. తర్వాత వీరు చీలిపోయి కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో స్థిర నివాసం ఏర్పరచుకొని నివసిస్తున్నారు.

జేను అనగా తేనే, కురుబ అనగా కాపరి అని అర్థం. ఈ తెగ ప్రజలు తేనే సేకరించటం ప్రధాన పనిగా ఉండటంతో వీరిని స్థానిక భాషలో జేను కురుబగా పిలవబడుతుంది. ఒక చరిత్రకారుని అభిప్రాయం ప్రకారం పల్లవరాజుల సామ్రాజ్యం పతనం తర్వాత చాలా వరకు కురుబలు దక్షిణ భారతదేశంలో చిన్న భూస్వాములుగా మారటం, కొంతమంది అడవులలోకి వెళ్ళటం జరిగింది. ఈ విధంగా అడవులలోకి వెళ్ళినవారు తమదైన సంస్కృతులు, సంప్రదాయాలు కలిగి ఉన్నారు.

ఇట్టి తెగలు అడవులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రంలో బందీపూర్ నేషనల్ పార్క్ ప్రకటించే వరకు వీరు అడవులలో నివసించేవారు. ఆ తర్వాత వీరు జాతీయ పార్క్ చట్టాలు/నిబంధనలకు లోబడి ఏర్పరచుకోవటం, క్రమంగా వీరు జనజీవన స్రవంతిలో కలవటం జరిగింది.

ఈ తెగ సమూహం సంచార జీవనం, పోడు వ్యవసాయం, వేటపై ఆధారపడి జీవించేవారు. వీరు చిన్న చిన్న సమస్యలను పరిష్కరించు కొనేవారు. ఇట్టి విధానాన్ని హది/హత్తి అని పిలుస్తారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వల్ల వీరు జనజీవన స్రవంతిలో వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలను ఉపయోగించుకొని లబ్ధిని పొందుతున్నారు. ముఖ్యంగా కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరించటం, తేనేను సేకరించటం, సంప్రదాయక ఆహారాన్ని సేకరించటం, వెదురును ఉపయోగించి వ్యవసాయం చేస్తున్నారు.

వీరు ప్రత్యేక మాండలిక భాష అయిన జేను కురుబ భాషను ఎక్కువగా వాడుకలో ఉపయోగిస్తున్నారు.

వీరి పట్ల ప్రభుత్వం అశ్రద్ధ చూపటం/చిన్న చూపు చూడటం, సరైన వైద్యసేవలు లభించకపోవడంతో చాలా మంది అనారోగ్యానికి గురౌవుతున్నారు. ముఖ్యంగా వీరు సరైన పోషకాహారం తీసుకోక పోవడం వల్ల చాలా మంది క్షయవ్యాధి సోకి చనిపోతున్నారు. అంతేగాకుండా డయేరియా, చర్మరోగాలు, ఆస్తమా, రక్తహీనత, వ్యాధితో బాధపడుతున్నారు.

ఈ తెగ అడవుల నుండి బలవంతంగా నెట్టివేయబడి నాగరికత ప్రపంచంలో స్థిరపడలేక మద్యపానానికి బానిస అయ్యారు. నేడు గిరిజన నాగరికత సమాజంలో విలీనం కాలేక, కనుమరగయ్యే దశలో ఉన్నారు. ఇట్టి తరుణంలో ప్రభుత్వం రానున్న కాలంలో సరైన చర్యలు చేపట్టి వారికి ఉపాధులు కల్పించాల్సివుంది. లేకపోతే జేను కురుబ తెగ అంతరించే ప్రమాదం ఉంది. ✸

## మథనం

# సహకరించే హస్తాలు!

**మే** *దే శుభాకాంక్షలు!*

*రవీంద్రనాథ్ టాగూర్‌ను స్మరించుకుందాం!*

*బుద్ధుణ్ని స్మరించుకుందాం!*

ఐదు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో జరిగిన ఎన్నికలతో కాంగ్రెస్ ఇప్పటివరకు ఎన్నడూ చేరుకోని అట్టడుగు స్థాయికి చేరుకుంది. ఆ పార్టీ తిరిగి తనకు తాను పునర్మించుకోవాలి, ఆ పార్టీలో సంస్కరణలు రావాలి, ఆ పార్టీలో భారీ మార్పులు రావాలి. వస్తాయని ఆశిస్తున్నాను. బీజేపీ క్రమక్రమంగా బలపడుతోంది. ఒకటో, రెండో ప్రాంతీయ పార్టీలు మేమున్నామంటూ ముందుకు వస్తున్నాయి. బహుముఖ పోటీల స్థానంలో ముఖాముఖీ పోటీలు కనిపిస్తున్నాయి.

వీటన్నిటి నడుమ డాక్టర్ జయప్రకాశ్ నారాయణగారి లోక్‌సత్తా ఎన్నికల రంగం నుంచి విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. ప్రజల గురించి ఆలోచించే బాధ్యతాయుతమైన వారికి ఇది ఔచిత్యమేనా? అయితే వాలంటీర్లు కలిగిన సలహా సంస్థగా అది విధులు కొనసాగిస్తుంది.

ఎన్డీయే తన రెండేళ్ల విజయోత్సవాలను జరుపుకుంటోంది. తెలంగాణలో కేసీఆర్‌కు చెందిన టీఆర్ఎస్, ఏపీలో నారా చంద్రబాబునాయుడుకు చెందిన టీడీపీ ప్రభుత్వాలు అధికారంలో రెండేళ్ల కాలాన్ని పూర్తి చేసుకుంటున్నాయి. సంక్షేమం, నగదు బదిలీ చాలా బాగా జరిగిపోతున్నాయి. 2030 నాటికి పేదరికాన్ని కనీస స్థాయికి తగ్గించాలన్న మా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను పక్కనబెడితే, పేదలను సంఘటితపరచి, వారి సామర్థ్యాలు నిర్మించి, పేదరికంపై తమంతట తాముగా పోరాడేలా వారికి అధికారాన్ని, ప్రత్యామ్నాయాలను అందించి, ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యం ఇంకా చాలా దూరంలో ఉంది. ఈ ప్రయత్నాలపై దృష్టి సారించడం తక్షణ కర్తవ్యం.

పేదరిక నిర్మూలన సంస్థలు, జీవనోపాధులు, పేదలకు ఉపాధిపై ఒక సాధికార కేబినెట్ మంత్రికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చింది. ఒక నిర్దిష్ట కాలపరిమితి కలిగిన కార్యదర్శి అవసరముంది. 70, 80వ దశకాలలో ఉన్న NDDB లాంటి సాధికార, స్వతంత్ర, సాంకేతిక సహకార నిబద్ధ సంస్థ అవసరముంది. పౌరసమాజం మరింత బలంగా ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. జాతీయస్థాయిలో పేదల సమిష్టి సంఘాలు కొంత బాధ్యతను తీసుకోవాల్సిన అవసరముంది. పేదరిక నిర్మూలన, జీవనోపాధి, అభివృద్ధి కార్యకర్తలు సంఘటితమై, పేదల కోసం పని చేసే సంస్థలకు, ప్రభుత్వాలకు సహకరించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇందుకోసం పెద్ద సంఖ్యలో మెరుగైన సామర్థ్యాలు కలిగిన వృత్తి నిపుణులను ఉత్పత్తి/తయారు చేసుకోవడం కోసం అవసరమైన సంస్థలను ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

దేశవ్యాప్తంగా కమ్యూనిటీ లీడర్లు, కార్యకర్తలు, రిసోర్స్ పర్సన్స్, వృత్తి నిపుణులతో కలిసి పని చేయడానికి ఏదాదికి రెండు లక్షల మంది వంతున ఒక దశాబ్దంలో ఒకటి లేదా రెండు మిలియన్ల మంది రిసోర్స్ పర్సన్స్/మెంటార్లను సిద్ధం చేసుకునేందుకు అవసరమైన అభ్యాస కార్యక్రమాలను, వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి తగిన సమయమిదే.

మన విశ్వాసం, నమ్మకం తప్పుడు దారిలో లేవు. స్వయం సహాయక, క్షమతా జనాందోళనలు పురోగమిస్తున్నాయి. మనం కొంత ఊతమిచ్చి, సహకరిస్తే అది మరింత వేగంగా, త్వరగా జరుగుతుంది.

ఇందుకు ఎలాంటి సంకోచం లేకుండా సహకరిద్దాం. దానికి భరోసా ఇద్దాం. అందుకు నిధులు సమకూరుద్దాం. భాగస్వాములంతా చేతులు కలిపేలా సమన్వయపరుద్దాం. వివిధ స్థాయిలలో సహకరించే చేతులను ఏకం చేద్దాం. జాతీయస్థాయిలో వందకు పైగా, రాష్ట్రస్థాయిలో వేయికి పైగా, బ్లాక్‌స్థాయిలో లక్షకు పైగా, గ్రామస్థాయిలో ఒక మిలియన్‌కు పైగా! మూడేళ్లలో దీనిని పూర్తి చేయగలమా? అదీ నాణ్యత విషయంలో రాజీ పడకుండా?

పేదరిక నిర్మూలన జరిగి, మెరుగైన జీవనోపాధులు, జీవితాలు లభిస్తాయని విశ్వసిస్తే, దాన్ని నిజం చేసేవారికి అధికారాన్ని ఇవ్వడానికి ప్రజలు సిద్ధం. ప్రజలు వారికి 'బ్రహ్మరథం' పడతారు. దేశాన్ని పాలిస్తున్న సంకీర్ణ ప్రభుత్వాలు ఈ దిశగా పని చేయాలని ఆశిద్దాం. జాతీయ, రాష్ట్ర, జిల్లా, బ్లాక్, గ్రామపంచాయితీ స్థాయిలోని నేతలు దీన్ని అర్థం చేసుకుని, తమ వంతు పాత్రను నిర్వహించాలని కోరుకుందాం.

మనం విజ్ఞానం వైపు, వివేచన వైపు పయనిద్దాం. సమానత్వం, మానవత్వం, సమన్యాయం వైపు పురోగమిద్దాం. ప్రజల వద్దకు వెళ్లి, ప్రజలతో ఉంటూ, ప్రజల కోసం పని చేద్దాం.

**జి. మురళీధర్** ✸




**మే 1, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం**




**మే 10, అంతర్జాతీయ మాతృ దినోత్సవం**

## ఆమ్ ఆద్మీ సంభాషణ

### నా ఉద్యోగం క్రమబద్ధీకరణ కావాలి...

**మీ గురించి మరియు మీ కుటుంబం వివరాలు తెలపండి?**



నా పేరు ఎస్. ప్రభాకర్, వయస్సు 26 సం॥రాలు. మా స్వగ్రామం పోచంపల్లి, నల్లగొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. మా కుటుంబంలో నేను, నా భార్య, మా తల్లిదండ్రులు మరియు ఇద్దరు తమ్ముళ్ళతో కలిసి ఉంటాము. మా తల్లిదండ్రులు చేనేత వృత్తి చేసుకొని జీవిస్తున్నారు.

**మీరేమి పనిచేస్తున్నారు?**

నేను తెలంగాణ రాష్ట్ర హాండ్లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ-హైదరాబాద్‌లో కాంట్రాక్ట్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. నేను డిప్లొమా ఇన్ హాండ్లూమ్ టెక్నాలజీ కోర్సును పూర్తిచేశాను. తద్వారా సొసైటీలో 2010 సం॥రం నుండి పనిచేస్తున్నాను. నా ఉద్యోగ నిర్వహణలో పై అధికారుల ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల చేనేత సహకార సంఘాలతో చేనేత ఉత్పత్తులను సేకరించటం, వాటిని సంస్థకు తరలించటం వంటివి చేస్తుంటాను. ఇట్టి ఉత్పత్తులను సంబంధిత చేనేత శాఖ వారు నిర్వహించిన ఎగ్జిబిషన్ మేళాలో మా సిబ్బంది ద్వారా అమ్మకం చేస్తుంటాము. తద్వారా చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించటం, సంస్థకు ఆదాయంను పెంపొందించి చేనేత కార్మికులకు ఉపాధిని పెంపొందించేందుకు కృషి చేస్తుంటాను.

**మీరు గతంలో ఏం పని చేసేవారు?**

నేను గతంలో భద్రాచలంలోని ఆప్కో హాండ్లూమ్ సెంటర్‌లో సేల్స్ డివిజన్‌లో పనిచేశాను. ఆ తరువాత ఒకటిన్నర సంవత్సరం ఇ-కామర్స్ విభాగంలో ఫోటోగ్రాఫర్‌గా పనిచేశాను. ప్రస్తుతం ప్రొక్యూర్‌మెంట్ విభాగంనకు ఇంఛార్జ్‌గా పనిచేస్తున్నాను.

**మీ పనికి సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలేమి?**

నేను ప్రధానంగా ఉద్యోగ భద్రత సమస్యను ఎదుర్కొంటున్నాను. అదేవిధంగా మా నాన్న అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. నాకు ఆరోగ్య బీమా లేకపోవడంతో మా నాన్నకు మెరుగైన వైద్యం కల్పించలేక పోతున్నాను.

**మీకు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి చేకూరిందా?**

నేను ప్రభుత్వం నుండి ఆధార్ కార్డు, ఓటర్ కార్డులను పొందాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

నా ఉద్యోగంను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయాలని కోరుకుంటున్నాను. అదేవిధంగా చేనేత కార్మికులకు నావంతు సేవలను అందించాలని అనుకుంటున్నాను. ✷

## నిస్సహాయుల సంభాషణ

### కిరాణా షాపు పెట్టుకోవాలనుకుంటున్నాను...

**మీ గురించి చెప్పండి?**



నా పేరు వినోద్ కుమార్, వయస్సు 19 సం॥రాలు. నేను 7వ తరగతి వరకు చదువుకున్నాను. నేను వికలాంగుడిని కావడంతో పై చదువులు చదవలేక పోయాను. మా స్వగ్రామం జనకుంట తండా, ఎల్లంపేట గ్రామం, మరిపెడ మండలం, వరంగల్ జిల్లా. నేను నా తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్నాను. నాకు ఇద్దరు అక్కా చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. అక్క డిగ్రీ చదివింది. చెల్లి 10వ తరగతి చదువుతుంది. తమ్ముడు 6వ తరగతి చదువుతున్నాడు.

**మీ చదువును ఎందుకు కొనసాగించలేదు?**

మా గ్రామంలో హైస్కూల్ లేకపోవడంతో నా వికలాంగత్వం కారణంగా ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించలేకపోయాను.

**మీరు ఏం పనిచేస్తారు?**

పుట్టుకతో నేను వికలాంగునిగా జన్మించటంతో నా తల్లిదండ్రులు సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా మాకు ఉన్నటువంటి 3 ఎకరాల భూమిలో వ్యవసాయం చేయటంలో సహాయం చేస్తుంటాను. ముఖ్యంగా మా పొలంలో పనిచేయటానికి మా ఇంటి చుట్టుప్రక్కల వారిని పనికి వచ్చేలా పురమాయించటం, అదేవిధంగా ఇంటికి సంబంధించిన కిరాణ సామాగ్రిని షాపు నుండి తేవటం వంటివి చేస్తుంటాను. మిగతా సమయంలో ఇంటి దగ్గరే ఉంటాను.

**మీరు గ్రామంలోని ఏదైనా గ్రూపులో సభ్యులుగా ఉన్నారా?**

నేను 6 నెలల క్రితం మా గ్రామంలోని వికలాంగుల స్వయం సహాయక సంఘంలో సభ్యునిగా చేరాను. అట్టి సంఘానికి ప్రతినెల రూ. 50లు పొదుపు చేస్తుంటాను.

**మీరు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?**

నేను నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నాను. అదేవిధంగా రవాణాకు గాను ట్రై సైకిల్‌ను మండల కార్యాలయం నుండి పొందేందుకు ప్రయత్నించగా విఫలమయ్యాను.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

ప్రభుత్వం నుండి నేను వికలాంగుల పింఛను కింద నెలకు రూ. 1500లు పొందుతున్నాము. వీటితోపాటు ఓటర్‌కార్డు, ఆధార్‌కార్డులను పొందాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

భవిష్యత్‌లో మా గ్రామంలో సొంతంగా కిరాణా షాపును పెట్టుకోవాలని అనుకుంటున్నాను. ✷

## కమ్యూనిటీ లీడర్ సంభాషణ

### ఉత్తమ మండల సమాఖ్యగా నిలబడాలి...

**మీ గురించి చెప్పండి?**

నాపేరు క్రిష్ణవేణి, వయస్సు 42 సం॥రాలు. మా స్వస్థలం జనంపేట గ్రామం, పినపాక మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. నా భర్త చనిపోవడంతో నేను నా పిల్లలతో కలిసి నివసిస్తున్నాను. నా కూతురు భద్రాచలంలో ITDA కు సంబంధించిన కళాశాలలో డిగ్రీ చదువుతుంది.

**మీరు ఏం పనిచేస్తారు?**

నేను 2013 సం॥రం నుండి స్వశక్తి మండల మహిళా సమాఖ్య (MMS)కు అధ్యక్షురాలిగా పనిచేస్తున్నాను. అదేవిధంగా శబరి గ్రామైక్య సంఘం (VO)కు అధ్యక్షురాలిగా మరియు స్నేహాంజలి స్వయం సహాయక సంఘం(SHG)కు అధ్యక్షురాలిగా గత 15 సం॥రాలుగా పనిచేస్తున్నాను. నావిధి నిర్వహణలో భాగంగా ప్రతినెల నిర్ణీత తేదీలలో మండల సమాఖ్య భవనంలో ఎజెండా రూపొందించి సమావేశాలు నిర్వహించటం, MMS బ్యాంకు అకౌంట్‌కు సంబంధించిన తదితర వివరాలను చర్చిస్తాను.

అదేవిధంగా జిల్లా సమాఖ్య సమావేశాలకు MMS నుండి ప్రాతినిధ్యం వహించి MMS సమస్యలను విన్నవించి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తాను. అందుకుగాను MMS నుండి రవాణా భత్యం ఇస్తారు. నాకు ఉన్నటువంటి 2.5 ఎకరాల భూమిని పొరుగువారికి కౌలుకి ఇవ్వటం ద్వారా ఆదాయాన్ని పొందుతున్నాను. మిగతా సమయంలో మిర్చి, పత్తి, పొలాలకు కూలీ చేయటానికి వెళతాను. వీటితోపాటు ఎండకాలంలో ఉపాధి హామీ పథకం పనులకు కూడా వెళుతుంటాను. నేను ITDA ద్వారా రుణం పొంది మా ఇంటి ఆవరణలో కిరాణా షాపును నిర్వహిస్తున్నాను.

**మీ ఏమైన శిక్షణలు పొందారా?**

అవును. నేను నాయకత్వం, పాత్ర, బాధ్యతలపై శిక్షణను తీసుకున్నాను. ఇట్టి శిక్షణ వల్ల గత 15 సం॥రాలుగా MMS, VO, SHGలతో చురుకుగా పనిచేయగలుగుతున్నాను.

**మీరు ఏమైన సమస్యలను ఎదుర్కొంటున్నారా?**

అవును. మా కార్యనిర్వాహక బృందం నుండి రాజకీయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాను.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

నేను ప్రభుత్వం నుండి ఇందిరమ్మ పథకం క్రింద ఇల్లును మరియు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ కార్డులను పొందాను. వీటితోపాటు వితంతువు పింఛను పొందుతున్నాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

భవిష్యత్‌లో మా MMSను జిల్లాలో ఉత్తమ మండల సమాఖ్యగా నిలబడేందుకు కృషిచేస్తాను. అదేవిధంగా నా పిల్లలను బాగా చదివించి, జీవితంలో స్థిరపడేలా కృషిచేయాలనుకుంటున్నాను. ✸

## కమ్యూనిటీ వర్కర్ సంభాషణ

### ప్రభుత్వ పథకాలు అందరికి అందాలి...

**మీ గురించి చెప్పండి?**



నా పేరు రమేష్, వయస్సు 36 సం॥రాలు. నేను డిగ్రీ పూర్తి చేశాను. నా స్వస్థలం పినపాక మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. మా కుటుంబంలో నేను, నా భార్య, పిల్లలు మరియు నా తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాను. నా కూతురు 6వ తరగతి చదువుతుంది, కొడుకు 4వ తరగిత చదువుతున్నారు. నాకున్న 2 ఎకరాల భూమిలో వరి సాగు చేస్తున్నాను.

**మీరు ఏమి పనిచేస్తున్నారు?**

నేను ఖమ్మం జిల్లా, పినపాకం మండలంలో క్లస్టర్–కో ఆర్డినేటర్(CC)గా గత 8 నెలలుగా పనిచేస్తున్నాను. నేను 9 గ్రామాలలోని, 12 గ్రామైక్య సంఘాలు (VO), 125 స్వయం సహాయక సంఘాలు (SHG), 13 వృద్ధుల SHGలను సమన్వయం చేస్తుంటాను. నా విధిలో భాగంగా SHG, VOలను ఏర్పాటు చేయటం, వాటిని బలోపేతం చేయటం, పనిచేయని SHGలను బలోపేతం చేయటం, ప్రతి వారం తరచుగా సమావేశాలు జరిగేలా చూడటం, SHG, VOలకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడటం, బ్యాంకు సంబంధిత వ్యవహారాలలో సమన్వయం చేయటం జరుగుతుంది. ఇప్పటివరకు రూ.25 లక్షల రుణాలను SHGలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ నుండి అందేలా కృషి చేశాను.

**మీరు గతంలో ఎక్కడ పనిచేశారు?**

నా డిగ్రీ పూర్తయిన తరువాత అనాథ ఆశ్రమ పాఠశాలలో వాలంటీర్‌గా పనిచేశాను. ఆ తర్వాత అశ్వాపురం CCగా పనిచేశాను.

**మీ ఉద్యోగానికి సంబంధించిన ఏమైనా శిక్షణలు తీసుకున్నారా?**

నేను గత సం॥రం స్త్రీనిధి అంశంకు గాను రెండు వారాల శిక్షణను హైదరాబాద్‌లోని AMR-APARDలో పొందాను.

**మీ విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?**

నేను పనిచేస్తున్న ప్రాంతం పూర్తిగా గిరిజన ప్రాంతం కావటం, ఎక్కువగా నిరక్షరాస్యులు ఉండటం, నేను చెప్పిన విషయాలను వారు సరిగా ప్రతిస్పందించక పోవడం, కార్యక్రమ ఉద్దేశ్యం సాధించేక్రమంలో చాలా సమయం తీసుకోవడం జరుగుతుంది. మరియు నేను పడిన కష్టానికి సరైన ప్రతిఫలం లభించకపోవడం, అందుకుగాను వచ్చే జీతం తక్కువగా ఉండటంతో నా కుటుంబానికి సరైన సహకారాన్ని అందించ లేకపోతున్నాను.

**భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

భవిష్యత్‌లో నా పిల్లలకు మంచి విద్యను అందించి వారిని ఉన్నత స్థితిలో చూడాలనుకుంటున్నాను. మరియు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలనుకుంటున్నాను. ✸

# విజ్ఞానాన్ని పెంచుకోవాలనుకుంటున్నాను...

**మీ గురించి చెప్పండి?**



నాపేరు డోలన్ ముఖర్జీ, వయస్సు 28 సం॥రాలు. నేను రూరల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. నా స్వస్థలం దుర్గాపూర్, బుర్ద్వాన్ జిల్లా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం. నా కుటుంబంలో నేను, నాభర్త, మా అమ్మ, అక్కలతో కలిసి నివసిస్తున్నాను.

**ప్రస్తుతం మీరు ఎక్కడ పనిచేస్తున్నారు? ఈ సంస్థలో ఎలా ఎంపిక చేయబడ్డారు మరియు ఎప్పటి నుండి పనిచేస్తున్నారు?**

ప్రస్తుతం నేను హెల్పేజ్ ఇండియా (HI) సంస్థ నిర్వహిస్తున్న 'గమన్' ప్రాజెక్టులో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ (PE)గా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్గాట్ బ్లాక్, ఈస్ట్ మిద్నాపూర్ ప్రాంతంలో పనిచేస్తున్నాను.

నేను 2010 సం॥రం నుండి కలకత్తాలోని HI సంస్థలో యంగ్ ప్రొఫెషనల్ (YP)గా పనిచేశాను. ఈ ఉద్యోగానికి సంబంధించిన ప్రకటనను devnetjobsindia.org వెబ్‌సైట్‌లో చూసి YPకి సంబంధించిన ఉద్యోగానికి దరఖాస్తు చేశాను. సంస్థ వారు YPకి అర్హతకుగాను సంబంధిత విభాగంలో మరియు కంప్యూటర్ పరీక్షను, ఇంటర్వ్యూలో ఉత్తమ ప్రతిభను చూపెట్టడంతో నన్ను ఎంపిక చేశారు. ఆ తరువాత డెవలప్‌మెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంకు హాజరయ్యాను.

HI సంస్థ ఆర్థిక సహాయంతో నడుస్తున్న 'స్పాన్సర్ ఎ గ్రాండ్ పేరెంట్' ప్రాజెక్టులో పనిచేశాను. ఈ ప్రాజెక్టు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా కేంద్రంగా 6 జిల్లాలలో నిర్వహించింది. ఆ తరువాత HI ఇంటర్నేషనల్ సంస్థ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న 'అస్థిత్వ' ప్రాజెక్టులో ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేశాను. నవంబర్ 2015 నుండి 'గమన్' ప్రాజెక్టులో PEగా పనిచేస్తున్నాను.

**మీ పని నేపథ్యం గూర్చి చెప్పండి?**

నా ఉద్యోగ నేపథ్యం: వృద్ధుల స్వయం సహాయక సంఘాల (ESHG)ను ఏర్పరచటం, వృద్ధులతో కలిసి గ్రామస్థాయిలో సంఘాల (VLF)ను ఏర్పాటు చేయటం, ESHG, VLF సభ్యులకు, లీడర్లకు శిక్షణలు ఇవ్వడం, ESHGలకు మైక్రోక్రెడిట్ ప్లానింగ్‌కు సంబంధించిన అవగాహనను కల్పించటం జరుగుతుంది. అదేవిధంగా ESHGల నుండి బుక్‌కీపర్‌లను గుర్తించటం, బుక్‌కీపింగ్‌కు సంబంధించిన శిక్షణను ఇవ్వటం, చురుకుగా ఉన్న వృద్ధులను గుర్తించి వారికి వృద్ధుల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (ECRP)శిక్షణను ఇవ్వటం, ESHGలు బ్యాంకు ఖాతాలు తెరిచేలా చూడటం, తద్వారా రుణాలు వచ్చేలా చూడటం, ESHGలు తరుచూ సమావేశాలు జరిపేలా చూడటం, అంతర్గత రుణాలు తీసుకునేలా చూడటం, బుక్‌కీపర్‌లను పర్యవేక్షించటం, తీసుకున్న రుణాలను ESHGలకు తిరిగి ఇచ్చేలా చూడటం, అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య, వితంతువు పింఛన్లు వచ్చేలా చూడటం మరియు అన్నపూర్ణ పథకం వచ్చే విధంగా చూడటం, వృద్ధులలో ఎవరైన నిరాశ్రయులను గుర్తించి వారికి ESHGల ద్వారా రక్షణ, ఆశ్రయం కల్పించటం, తరుచుగా వైద్య శిబిరాలను నిర్వహించటం, వారికి అవసరమైన వస్తువులను అందించటం, గ్రామస్థాయిలో సంఘాల ద్వారా సమూహ ఆధారిత నిర్వహణ వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయడం, ESHGల ద్వారా వ్యవసాయ/వ్యవసాయేతర జీవనోపాధులను గుర్తించి వృద్ధులకు ఆదాయ మార్గాలను పెంపొందించుకునేలా చేయటం, జీవనోపాధులకు సంబంధించిన వస్తువులను ESHGలకు ప్రాజెక్టు ద్వారా అందించటం జరుగుతుంది.

**మీరు గతంలో ఎక్కడ పనిచేశారు?**

నేను రైట్ ట్రాక్ ప్రాజెక్టులో స్పాన్సర్‌షిప్ కో-ఆర్డినేటర్‌గా ఆగష్టు 2009 నుండి మే 2010 వరకు పనిచేశాను. దీనికి యాక్షన్ ఎయిడ్ సంస్థ సహాయ సహకారం అందించారు.

**మీ ఉద్యోగ నిర్వహణలో ఏమైనా గుర్తింపు పొందారా?**

పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బీహార్‌లో అషర్ అలో ESHG వారు గధాధర్ మేళా ఉత్సవ సమయంలో ఎల్డర్ ఫర్ ఎల్డర్ నినాదాలతో మారు మ్రోగటం నేను స్వయంగా గమనించాను. ఆ తరువాత వారు జాతీయ బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవటం, వాటితో అనుసంధానం జరగటంతో నాకు గుర్తింపు వచ్చింది.

**మీరు పొందిన అనుభవాలను తెలపండి?**

నేను వృద్ధులతో కలిసి పనిచేస్తున్నప్పుడు వారియొక్క అమూల్యమైన సలహాలు, అనుభవాలు నాకు చాలా ఆనందాన్ని, విజ్ఞానాన్ని ఇచ్చాయి. అందుకుగాను వృద్ధులకై వారు కోల్పోయిన ఆత్మగౌరవమును పెంపొందించేందుకు కృషిచేస్తున్నాను. వారి దీవెనలు నాకు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటున్నాను.

**మీ పనిలో భాగంగా ఏవైన సమస్యలను ఎదుర్కొన్నారా?**

గ్రామీణ ప్రాంతాలలోని నివసించే వృద్ధులను ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాలలోకి తీసుకురావటం చాలా కష్టతరంగా ఉంది. వృద్ధులకు ఆర్థికపరమైన విషయాలపట్ల అవగాహన లేకపోవటం, ఆర్థిక అభివృద్ధికి గాను బ్యాంకుల నుండి రుణాలను తీసుకోవటం వంటి విషయాలపై సరిగా అవగాహన లేకపోవటం, వృద్ధులకు సరిపడిన ఆరోగ్య వసతులు లేకపోవటం, వృద్ధులకు సరైన సామాజిక భద్రతతో కూడిన పథకాలు లేకపోవటం, నిరాశ్రయ వృద్ధులను ఆపలేకపోవటం, చిన్న కుటుంబాల వ్యవస్థలో వృద్ధులను చీదరించుకోవటం వంటివి సమస్యలు ఎదురవుతున్నాయి.

**మీరు ఇట్టి సమస్యలను క్షేత్రస్థాయిలో ఎలా అధిగమిస్తున్నారు?**

ముఖ్యంగా నేను ఆర్థిక, ఆర్థికేతర సంస్థలతో ESHGలను అనుసంధానం చేయటం, ప్రభుత్వ సంబంధిత శాఖలకు వృద్ధుల సమస్యలను తెలిపి, ఆయాశాఖలతో సత్సంబంధాలను నెలకొల్పుతున్నాను. అదేవిధంగా వృద్ధులలో పొదుపు పట్ల అవగాహనను పెంచి వృద్ధుల సాధికారతకు ESHGల ఏర్పాటు బలోపేతంకు కృషిచేస్తున్నాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

భవిష్యత్‌లో నేను ఈ రంగంలో విజ్ఞానాన్ని పెంపొందించుకొని అభివృద్ధి రంగ నిపుణులుగా అయ్యేందుకు కృషిచేస్తున్నాను. అందుకుగాను సమాజంలోని ప్రజలతో మమేకమై పనిచేస్తున్నాను. ✷

ఫోకస్

# బి. ఆర్. అంబేద్కర్

బాబా సాహెబ్ అంబేద్కర్‌గా సుప్రసిద్ధులైన డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ భారత రాజ్యాంగ ప్రధాన రూపకర్తలలో ఒకరు. మన దేశంలో అంటరానితనం, కులవ్యవస్థలాంటి సామాజిక దురాచారాల నిర్మూలనలో సుప్రసిద్ధ రాజకీయ నాయకుడు, న్యాయవేత్త.అయిన అంబేద్కర్ కృషి ఎన్నదగ్గది. ఒక విద్యావేత్తగా, పాత్రికేయునిగా, ఆర్థికవేత్తగా, కార్యకర్తగా, న్యాయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా ఆయన ఎన్నో పాత్రలు సమర్థంగా నిర్వహించారు. అయితే వీటన్నిటిలో భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా ఆయన నిర్వహించిన పాత్రను మాత్రం అతి గొప్ప, బాధ్యతాయుత పాత్రగా పేర్కొనవచ్చు.



బాబా సాహెబ్ అంబేద్కర్‌గా పేర్కొనే డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ భారత రాజ్యాంగ ప్రధాన రూపకర్తలలో ఒకరు. ఆనాడు సమాజంలో వేళ్లూనుకున్న అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన ఎంతో పోరాడారు. తన జీవితమంతా డాక్టర్ అంబేద్కర్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (ఎస్సీ, ఎస్టీలు) హక్కుల కోసం పోరాడారు. ప్రముఖ రాజకీయవేత్త, న్యాయవేత్త అయిన డాక్టర్ అంబేద్కర్ స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి కూడా.

డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ (బి.ఆర్. అంబేద్కర్/బాబా సాహెబ్) 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్‌లోని మోహోవ్ గ్రామంలో జన్మించారు. కుటుంబంలోని 14 మంది మంది పిల్లలలో ఆయన చిన్నవాడు. ఆయన తండ్రి రామ్‌జీ మాలోజీ సక్‌పాల్, తల్లి భీమాబాయి ముర్బద్కా. ఆయన తండ్రి భారత సైన్యంలో సుబేదార్‌గా పని చేసేవాడు. ఆయన మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబావాడేకు చెందినవారు. ఆయన మహార్ (ఎస్సీ) కులస్తుడు. ఆనాటి అంటరానితనం కారణంగా అంబేద్కర్ కుటుంబం ఆయన పుట్టడానికి ముందే మోహోవ్ కంటోన్మెంట్ ప్రాంతానికి తరలివెళ్లింది.

అంబావాడేకు చెందినవాడు కావడం చేత ఆయన పేరు అంబావాడేకర్‌గా ఉండేది. ఆ తర్వాత పాఠశాలకు వెళ్లే సమయంలో తరగతి ఉపాధ్యాయుడు దాన్ని అంబేద్కర్‌గా మార్చారు. అంబేద్కర్ తల్లి 1894లో మరణించింది. 1913లో అంబేద్కర్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఆయన తండ్రి కూడా కాలం చేశారు.

1907లో అంబేద్కర్ ముంబైలోని ఎల్ఫిన్‌స్టోన్ హైస్కూల్ నుంచి మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. ఆ తర్వాత పై చదువుల కోసం ఎల్ఫిన్‌స్టోన్ కాలేజీలో చేరారు. అది ముంబై యూనివర్సిటీకి అనుబంధంగా ఉండేది. దాదా కేలుస్కర్ అంబేద్కర్‌కు బుద్ధుని జీవిత చరిత్రను బహుమతిగా ఇచ్చారు. దాదా కేలుస్కర్ ఆయన కుటుంబ మిత్రుడే కాదు, ఆ పుస్తక రచయిత కూడా.

1912లో అంబేద్కర్ బాంబే యూనివర్సిటీ నుంచి ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. ఆ తర్వాత ఆయన బరోడా రాష్ట్ర ప్రభుత్వంలో ఓ బ్యాంక్‌లో ఉద్యోగాన్ని పొందారు. 1915లో ఆయన తిరిగి కొలంబియా యూనివర్సిటీ నుంచి ఎకనమిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆ తర్వాత మూడేళ్ల కాలానికి సాయాజీరావ్ గైక్వాడ్–III ద్వారా బరోడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ పొందారు. ఆ తర్వాత రాజు సాయంతో ఆయన 22 ఏళ్ల వయసులో తన పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడానికి అమెరికా వెళ్లి, అక్కడ సోషియాలజీ, హిస్టరీ, ఫిలాసఫీ, ఆంత్రోపాలజీల్లో కోర్సును పూర్తి చేశారు.

ప్రజాస్వామ్యంపై జాన్ డెవె రాసిన రచనలతో అంబేద్కర్ ప్రభావితులయ్యారు. ఆ కోర్సును చదివే రోజుల్లో ఆయన మొదట 'ప్రాచీన భారత వాణిజ్యం' అన్న అంశంపై థీసిస్‌ను సమర్పించారు. 1916లో రెండో థీసిస్ 'నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా – ఎ హిస్టారిక్, అనలిటికల్ స్టడీ'ని సమర్పించారు. 'ద ప్రాబ్లమ్ ఆఫ్ రుపీ' అన్న మూడో థీసిస్ ద్వారా ఆయన 1927లో ఎకనమిక్స్‌లో పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఆ తర్వాత కాలంలోనే ఆయన న్యాయ పట్టా కూడా పొందారు.

అంబేద్కర్‌కు 15 ఏళ్ల వయసులోనే 1906లో రామ్‌బాయ్‌తో వివాహమైంది. ఆయన భార్యకు అప్పుడు తొమ్మిదేళ్లు. ఆ తర్వాత ఆమె అనారోగ్యం కారణంగా 1935లో మృతి చెందింది. తన భార్య మృతి అనంతరం అంబేద్కర్ నిద్రలేమితో బాధపడేవారు. దానికి చికిత్స కోసం ఆయన బాంబేకు వచ్చారు. అదే సమయంలో 1940వ దశకం చివరలో ఆయన రాజ్యాంగ రచన కూడా పూర్తయింది. 1948లో ఆయన డాక్టర్ శారదా కబీర్‌ను వివాహమాడారు. ఆమె బ్రాహ్మణ కులస్తురాలు. అంబేద్కర్‌ను డయాబెటీస్, దృష్టి మాంద్యం లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు పట్టి పీడించనారంభించాయి. 'ద బుద్ధ అండ్ హిజ్ ధమ్మ' తుది రాతప్రతిని పూర్తి చేసిన మూడురోజుల తర్వాత అంబేద్కర్ కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలకు లక్షలాది మంది కార్యకర్తలు, మద్దతుదారులు, అభిమానులు హాజరయ్యారు.



అంటరానితనం కారణంగా అనేక దుర్భరమైన బాధలు అనుభవించిన అంబేద్కర్, దాన్ని నిర్మూలించాలనుకున్నారు. తన జీవితాంతం ఎస్సీ, ఎస్టీలు, వెనుకబడిన జాతుల ఉన్నతి కోసం కృషి చేశారు. 1923 నుంచి ఆయన న్యాయవృత్తిని చేపట్టి, ఎస్సీలు, వెనుకబడిన జాతుల ఉద్ధరణ కోసం పని చేయడం ప్రారంభించారు. కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో ఆయన ఎస్సీలు, ఇతర వెనుకబడిన జాతులు, మతాలవారికి రిజర్వేషన్‌లు ఉండాలని ప్రతిపాదించారు. ప్రజల వద్దకు చేరడానికి ఆయన 'మూక్‌నాయక్' అనే పత్రికను ప్రారంభించారు. దాని ద్వారా ఆయన కులవ్యవస్థ వల్ల కలిగే నష్టాలను చాటి చెప్పారు.

భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీకి ఛైర్మన్‌గా నియమితులయ్యాక అంబేద్కర్ తన సమయంలో ఎక్కువ భాగాన్ని రాజ్యాంగ రూపకల్పనకే వెచ్చించేవారు. దేశపౌరులకు పౌర స్వేచ్ఛ, మత స్వేచ్ఛ సమకూరే విధంగా, అంటరానితనం నిర్మూలన, అన్ని రకాల వివక్షలను తొలగించే విధంగా ఆయన అనేక రాజ్యాంగపరమైన హక్కులు, రక్షణను ఆయన రాజ్యాంగంలో పొందుపరిచారు.

అంబేద్కర్ మహిళల సామాజిక హక్కుల కోసం కూడా విస్తృతంగా పోరాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్‌లు కల్పించే విషయంలో ఆయనకు రాజ్యాంగ నిర్మాణ సభ మద్దతు కూడా లభించింది. అంబేద్కర్ న్యాయం; సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ;, సమానత్వం; సౌభ్రాతృత్వం ప్రాతిపదికగా ప్రవేశికను రూపొందించారు. మన ప్రవేశిక ఇప్పటికీ ఎంతో స్ఫూర్తిదాయకమైనది.

1930లో అంబేద్కర్ అఖిల భారత వెనుకబడిన కులాల సంస్థకు అధ్యక్షుడయ్యారు. 1932 సెప్టెంబర్ 25న వెనుకబడిన కులాల తరపున



Dr. Ambedkar with family of some of his associates (details could not be obtained)

అంబేద్కర్, ఇతర హిందూ కులాల తరపున మదన్ మోహన్ మాలవ్యల మధ్య పూనా ఒడంబడికపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా ప్రావిన్షియనల్ చట్టసభల్లో సీట్లకు వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ లభించింది. నాటి నుంచి భారత చట్టం, 1935 కింద అంటరానికులాలను ఎస్సీ, ఎస్టీలుగా పిలవడం ప్రారంభించారు.

1936లో అంబేద్కర్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు. 1937 కేంద్ర చట్టసభలకు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ 15 సీట్లు గెలుచుకుంది. ఆ తర్వాత ఆ పార్టీ పేరును అఖిల భారత షెడ్యూల్డ్ కులాల సమాఖ్యగా పేరు మార్చారు. అయితే 1946 ఎన్నికల్లో ఆ పార్టీ విఫలమైంది.

అంటరానికులాలను 'హరిజనులు' అని పిలవాలన్న కాంగ్రెస్, గాంధీ అభిప్రాయంతో అంబేద్కర్ విభేదించారు. అంటరానికులాల వారు కూడా సమాజంలోని ఇతర ప్రజలతో సమానమైన వారు అని అంబేద్కర్ వారితో వాదించారు.

రాజ్యాంగపరంగా అన్ని రక్షణలు కల్పించినప్పటికీ, భవిష్యత్‌లో ఎస్సీలు, ఇతర వెనుకబడిన కులాల వారి పరిస్థితి ఎలా ఉంటుందో అంబేద్కర్ ముందే ఊహించారు. బౌద్ధమతం స్వీకరించిన ఆయన, బౌద్ధం ద్వారా ఎస్సీలు, ఇతర బీసీలకు సమానత్వం సిద్ధిస్తుందని విశ్వసించారు. ఆ అభిప్రాయంతో ఆయన 1950లో శ్రీలంకకు వెళ్లి, అక్కడ బౌద్ధ తత్వవేత్తలు, సాధువుల సదస్సులో పాల్గొన్నారు. 50వ దశకంలో అంబేద్కర్ బౌద్ధమతాన్ని గురించి విస్తృతంగా చదివారు. దేశంలోని ఇతరకులాల వారితో సమానం కావాలంటే ఎస్సీలు, ఇతర వెనుకబడిన కులాల వారికి బౌద్ధమే శరణ్యమని ఆయన భావించారు.

1956, అక్టోబర్ 14న బుద్ధజయంతి సందర్భంగా అంబేద్కర్, ఆయనతో పాటు వేలాది మంది అనుచరులు బాంబేలో బౌద్ధమతాన్ని స్వీకరించారు. అదే రోజు ఆయన నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిలో సుమారు 5 లక్షల మంది అనుచరులను బౌద్ధమతంలోకి మార్చేందుకు బహిరంగ సభను ఏర్పాటు చేశారు. తన అనుచరులకు అంబేద్కర్ 22 సూచనలు చేశారు. బౌద్ధంపై అనేక గ్రంథాలు చదివిన అంబేద్కర్ - శ్రీలంక, బర్మా, ఖాట్మండు, నేపాల్‌లను సందర్శించి అనేక బౌద్ధ సదస్సులలో పాల్గొన్నారు. 1956లో ఆయన 'ద బుద్ధ అండ్ హిజ్ ధమ్మ' పుస్తకాన్ని రచించారు. ఆయన మరణానంతరం దానిని ప్రచురించడం జరిగింది. అంబేద్కర్ 1955లో భారత బౌద్ధ సమాజంను స్థాపించారు.

చరిత్రలో అతి ముఖ్యమైన ఆ సందర్భంలో, నాగ్‌పూర్‌లో బౌద్ధమతం స్వీకరించిన కేవలం ఆరు వారాల అనంతరం అంబేద్కర్ అకాల మరణం చెందడంతో దేశంలో బౌద్ధ ఉద్యమం పురోగతి దెబ్బ తినింది. నాగ్‌పూర్ తర్వాత అనేక నగరాలలో అలాంటి కార్యక్రమాలను చేపట్టాలని ముందుగా అనుకున్నప్పటికీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అంబేద్కర్ మృతితో ఆ ఉద్యమం చీలి, దిశను కోల్పోయింది. ఆ కొత్త విశ్వాసంపై నమ్మకమున్న లక్షలాది మందికి బోధించే వారు కరువయ్యారు.

అంబేద్కర్ గొప్ప విద్యావేత్త, న్యాయకోవిదుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. దేశంలోని లక్షలాది మహర్ కులానికి చెందిన అంటరానివారితో కలిసి బౌద్ధం స్వీకరించిన ఆయన, దేశంలోని బౌద్ధానికి గొప్ప ప్రాచుర్యం కల్పించారు. దేశంలోని కులవివక్షకు బౌద్ధమత స్వీకరణ ఒక ప్రతీకాత్మ ప్రతిఘటన. సామాజిక దురాచారాల నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎంతో విలువైనది. అందుకే ఆయనను ఎస్సీ, ఎస్టీలు మహాపురుషుడని పిల్చుకుంటారు.

మహిళలు ఆర్థికాభివృద్ధిలో పాల్గొనాలని ఆయన భావించేవారు. వారి సామాజిక స్థితి మెరుగుపడందే, సమానత్వం లేనిదే దేశం అభివృద్ధి చెందలేదనేది ఆయన విశ్వాసం. అందువల్ల వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచి, వారికి సమాన హక్కులు కల్పించి, తమకు నచ్చిన వృత్తిని చేపట్టే స్వేచ్ఛ కల్పించాలని భావించారు.

తాను స్వయంగా కులవివక్షను అనుభవించిన అంబేద్కర్ మహిళలు అణచివేతను ఎదుర్కోవడాన్ని, భారత నిచ్చెనమెట్ల వ్యవస్థ యొక్క బాధితులుగా వారిని చూశారు. వారి ఆర్థిక, సామాజిక హక్కుల కోసం



భార్యతో బి. ఆర్. అంబేద్కర్

తన జీవిత పర్యంతం పోరాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, వాటికి పరిష్కారాల కోసం బాంబే చట్టసభల్లో, డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా పార్లమెంట్‌లోను, దేశ మొదటి న్యాయశాఖ మంత్రిగాను తీవ్రంగా కృషి చేశారు.

అంబేద్కర్ యొక్క ముఖ్యమైన వాదనలు మాతృత్వ లబ్ధి బిల్లు మరియు కుటుంబ నియంత్రణ మీద ఉండడాన్ని బట్టి చూస్తే, ఆయనకు మహిళల పట్ల ఎంత గౌరవమో అర్థం చేసుకోవచ్చు. అలుపెరుగని ఆయన పోరాటంతో క్రమంగా ఫలితాలు రావడం ప్రారంభమయ్యాయి. మహిళలు క్రమంగా సత్యాగ్రహంలో పాల్గొనడం ప్రారంభించారు. అంటరానికులాల మహిళలు సంస్థలుగా ఏర్పడి, విద్యపై, తమపై తాము అవగాహన పెంచుకోవడం ప్రారంభించారు. 1940, జులైలో నాగ్‌పూర్‌లో జరిగిన అఖిల భారత అణగారిన మహిళల సదస్సులో మాట్లాడుతూ అంబేద్కర్, "నేను మహిళా సంస్థలలో సంపూర్ణంగా విశ్వసిస్తాను. వాళ్లే గనుక పూనుకుంటే సమాజంలోని పరిస్థితులను మార్చే శక్తి వారికుంది. వారు తమ పిల్లలకు విద్యను బోధించాలి" అని పిలుపునిచ్చారు.

1932లో అంబేద్కర్ మొదటి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని వచ్చిన అనంతరం నిర్వహించిన సమావేశంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. అంబేద్కర్ నిరంతరం మహిళల గురించి, వారి



స్థితిగతుల గురించి ఆలోచించేవారు. రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఆయన మహిళల హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచేందుకు ప్రయత్నించారు. మహిళలూ పురుషులతో సమానమన్న భావనతో ఆయన మహిళల కోసం కొన్ని ప్రత్యేక ప్రతిపాదనలను రాజ్యాంగంలో పొందుపరిచారు.

అంబేద్కర్ తన కాలంలోను, ఇప్పటికీ కూడా ఒక గొప్ప ఆలోచనాశీలి, రాజకీయవేత్త మరియు మేధావి. ఆయన అనేక కోట్లాది మంది ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో మార్పు తీసుకురావడంతో పాటు ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య ప్రభుత్వం యొక్క రాజ్యాంగానికి రూపకల్పన చేశారు. అంబేద్కర్ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని తెలుసుకానీ, ఆయన భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేశారని చాలా మందికి తెలియదు. భారత వ్యవసాయం మీద పరిశోధనలు నిర్వహించిన అంబేద్కర్, దాని మీద అనేక వ్యాసాలు రాశారు.

వ్యవసాయంపై సదస్సులు నిర్వహించి, వ్యవసాయ, రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాడారు. అంతే కాకుండా దేశంలో రైతు ఉద్యమాలలో కూడా ఆయన పాల్గొన్నారు. 'భారతదేశంలో చిన్న కమతాలు – వాటికి పరిష్కారాలు', 'స్టేటస్ అండ్ మైనారిటీస్' అన్న వ్యాసాలలో ఆయన ఆలోచనలు గమనించవచ్చు. మన దేశంలో ఎక్కువ శాతం భూమి చాలా కొద్ది మంది చేతిలో చిక్కుకుపోయిందని ఆయన అనేవారు. దీని వల్ల భూమి, వనరులను సరిగా వినియోగించుకోలేకపోవడం జరిగింది. దీని ఫలితంగా పెట్టుబడులు పెరిగి, తక్కువ ఉత్పాదన, తక్కువ ఆదాయం, తక్కువ నాణ్యతా ప్రమాణాలు ఉండేవి. వ్యవసాయ ఉత్పాదన కేవలం భూమి పరిమాణాన్ని బట్టి మాత్రమే కాకుండా, పెట్టుబడి, శ్రమ, ఇతర ఉత్పాదకాల మీద కూడా ఆధారపడి ఉంటుందని అంబేద్కర్ భావించేవారు. అందువల్ల తగిన పరిమాణంలో పెట్టుబడి, నాణ్యమైన కూలీలు దొరకకపోతే, భారీ పరిమాణంలోని పొలాల్లో కూడా ఎక్కువ ఉత్పత్తి లభించదు. అదే సమయంలో ఆ రెండూ తగినంత లభించినట్లైతే, వాటి నుంచి ఎక్కువ ఉత్పత్తి లభిస్తుంది. ఇదే ఆలోచనతో స్వాతంత్ర్యానంతరం 'భూపరిమితి చట్టం'కు రూపకల్పన చేయడం జరిగింది.

అంబేద్కర్ కులవ్యవస్థ కింద ఉన్న బానిసత్వం, వెట్టిచాకిరీ గురించి పేర్కొంటూ, వాటి నుంచి బయపట పడినప్పుడే దేశ ఆర్థికాభివృద్ధి జరుగుతుందని ప్రకటించారు. వ్యవసాయ రంగంలో ఉన్న సమస్యలను ప్రస్తావిస్తూ – సమిష్టి వ్యవసాయం, భూమిని సమానంగా పంచడం, భారీస్థాయిలో పారిశ్రామికీకరణ, రైతులకు రుణసదుపాయం, నీరు, విత్తనాలు, ఎరువులు లభించేలా చేసినపుడే వ్యవసాయ లాభసాటిగా ఉంటుందని పేర్కొనేవారు. బంజరు భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలని, కూలీలకు కనీస వేతనాలు ఇవ్వాలని అనేవారు. రైతులకు రుణాలిచ్చే ప్రైవేట్ వడ్డీవ్యాపారులను నియంత్రించాలనేవారు. పేదరికాన్ని, సమాజంలో అంతరాలను తొలగించి, అణగారిన వర్గాలపై పీడనను తొలగించినపుడే భారత ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుందనేవారు. ఈ రకంగా అన్ని రకాల పీడనను తొలగించడంపై ఆయన దృష్టి కేంద్రీకరించారు.

రాజ్యాంగ కమిటీకి ఆయన ప్రజాస్వామ్య ప్రభుత్వ సోషలిజంను ప్రతిపాదించారు. దానిలోని ముఖ్యమైన అంశాలు:

* అన్ని ప్రాథమిక పరిశ్రమలను ప్రభుత్వమే నెలకొల్పి, నిర్వహించాలి

* బీమా, వ్యవసాయాన్ని జాతీయం చేసి, ప్రభుత్వమే నిర్వహించాలి

* ఉత్పాదక వనరులను ప్రభుత్వమే నిర్వహించాలి

* ఉమ్మడి ఉత్పాదనను సమానంగా పంచాలి

* భూమిని, పరిశ్రమలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సందర్భంలో దానికి పరిహారాన్ని బాండ్ల రూపంలో ఇవ్వాలి.

* గ్రామాలకు చెందిన బంజరు భూములను గ్రామంలోని రైతుల మధ్య సమానంగా పంచాలి.

* భూస్వామి, కౌలుదారులు, వ్యవసాయ కూలీల మధ్య ఎలాంటి అంతరాలు ఉండరాదు.

* ప్రభుత్వమే సమిష్టి వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడిని, విత్తనాలను, ఎరువులను సమకూర్చాలి.

* భూ రెవెన్యూ పన్నును చెల్లించిన తర్వాత వచ్చిన ఆదాయాన్ని

రైతుల మధ్య పంచాలి.

* నియమాలు పాటించని వారికి శిక్షలు విధించాలి

భారత ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలంటే వ్యవసాయం, పారిశ్రామికీకరణే శరణ్యమని అంబేద్కర్‌లోని ఆర్థికవేత్త భావించేవారు. వ్యవసాయ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆయన వాదించేవారు. ప్రభుత్వం అందరికీ ఆహార భద్రత లభించేలా చూడాలనేది ఆయన కల. జాతీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి జరగాలని ఆయన బలంగా కోరుకునేవారు. ఇందుకోసం విద్యవ్యాప్తి, ప్రజల పరిశుభ్రత, ఆరోగ్యం, ప్రజలకు నివాస వసతులు కల్పించాలని ప్రతిపాదించారు.





అంబేద్కర్ 'ద ప్రాబ్లమ్ ఆఫ్ రుపీ – ఇట్స్ ఆరిజిన్ అండ్ సొల్యూషన్' అన్న అంశంపై థీసిస్ సమర్పించారు. దీనిలో ఆయన రూపాయి విలువ పడిపోవడానికి కారణాలను చర్చించారు. మారక స్థిరత్వం కన్నా, ధరల స్థిరత్వమే ముఖ్యమని ఆయన నిరూపించారు. అంతే కాకుండా ఆయన బంగారు, వెండి మారక విలువలను సమీక్షించి, ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావాన్ని అంచనా కట్టారు. 1951లో భారత ప్రభుత్వం ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంబేద్కర్ దేశంలో తక్కువ ఆదాయం పొందేవారిపై ఆదాయ పన్ను వేయడాన్ని వ్యతిరేకించారు. భూసంస్కరణలు, ప్రభుత్వపరంగా ఆర్థికాభివృద్ధిలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. ఆర్థికాభివృద్ధిలో పురుషులతో పాటు మహిళలకూ సమానావకాశాలు ఉండాలని ఆయన భావించేవారు. బ్రిటిష్ హయాంలో భారతీయ రూపాయి విలువ పడిపోతున్నపుడు అంబేద్కర్ భారత కరెన్సీ మీద చాలా ప్రభావాన్ని కనబరిచారు.

బ్రిటిష్ హయాంలో అంబేద్కర్ భారతీయ కరెన్సీ మీద దృష్టి సారించి, దానిపై పరిశోధన చేశారు. దానిపై ఆయన పరిశోధనా పత్రాన్ని కూడా సమర్పించారు. ఆ థీసిస్‌లో ఆయన బంగారు మారక విలువకు స్థిరత్వం ఉండదనీ, భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు బంగారు మారక విలువలపై ఆధారపడలేవని చర్చించారు. దాని వల్ల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందనీ, ధరలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గణాంకాలతో సహా, రూపాయి విలువ పడిపోవడానికి గల కారణాలను, తద్వారా రూపాయి కొనుగోలు విలువ ఎలా పడిపోతోందో వివరించారు. ప్రభుత్వ లోటును నియంత్రించి, ద్రవ్యం ఎప్పుడూ సరఫరాలో ఉండాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం ద్రవ్య మారక విలువకన్నా, ధరల స్థిరీకరణ మీద ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని అనేవారు. ఆయన రచించిన 'ద ప్రాబ్లమ్ ఆఫ్ రుపీ' కారణంగా ప్రభుత్వం ఎట్టకేలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపనకు ముందడుగు వేసింది.

అంబేద్కర్ అనేక పుస్తకాలు, వ్యాసాలు రాశారు. ఆయన జీవితం, ఆలోచనల ఆధారంగా అనేక సినిమాలు, నాటకాలు, ఇతర కళారూపాలు కూడా నిర్మించారు. ఆయన రాసిన వ్యాసాలు, పుస్తకాలు:

* అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్ ఆఫ్ ఈస్ట్ ఇండియా కంపెనీ

* ఏన్షియంట్ ఇండియన్ కామర్స్

* కాస్ట్ ఇన్ ఇండియా: దెయిర్ మెకానిజం, జెనెసిస్ అండ్ డెవలప్‌మెంట్

* స్మాల్ హోల్డింగ్ ఇన్ ఇండియా అండ్ దెయిర్ రెమెడీస్

* మిస్టర్ రసెల్ అండ్ ద రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ సొసైటీ

* ద ప్రెజెంట్ ప్రాబ్లమ్ ఆఫ్ ఇండియన్ కరెన్సీ – I

* ద ప్రెజెంట్ ప్రాబ్లమ్ ఆఫ్ ఇండియన్ కరెన్సీ – II

* సమీక్ష : కరెన్సీ అండ్ ఎక్స్చేంజ్ బై హెచ్‌ఎల్ చబ్లానీ

* ద ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిజనల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా: ఎ స్టడీ ఇన్ ద ప్రొవిన్షియల్ డీసెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్

* స్టేట్‌మెంట్ ఆఫ్ ఎవిడెన్స్ టు ద రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ

* స్టేట్‌మెంట్ ఆఫ్ ఎవిడెన్స్ టు ద రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ (1925, డిసెంబర్ 15న)

* సమీక్షా నివేదిక: రిపోర్ట్ ఆఫ్ ద ట్యాక్సేషన్ ఎంక్వైరీ కమిటీ, 1926

* అన్‌టచబుల్స్ ఆర్ ద చిల్డ్రన్ ఆఫ్ ఇండియాస్ ఘెట్టో

* ఎస్సే ఆన్ అన్‌టచబుల్స్ అండ్ అన్‌టచబులిటీ – సోషల్

* ఎస్సే ఆన్ అన్‌టచబుల్స్ అండ్ అన్‌టచబులిటీ – పొలిటికల్

* ఎస్సే ఆన్ అన్‌టచబుల్స్ అండ్ అన్‌టచబులిటీ – రిలీజియస్

* ఫిలాసఫీ ఆఫ్ హిందూయిజం

* ఇండియా అండ్ ప్రీరిక్విజిట్ ఆఫ్ కమ్యూనిజం

* రెవల్యూషన్ అండ్ కౌంటర్ రెవల్యూషన్
* బుద్ధ ఆర్ కార్ల్ మార్క్స్
* రిడిల్స్ ఇన్ హిందూయిజం
* ద అన్‌టచబుల్స్ అండ్ పాక్స్ బ్రిటానికా
* మను అండ్ ద శూద్రాస్
* లెక్చర్స్ ఆన్ ఇంగ్లీష్ కాన్‌స్టిట్యూషన్
* పారామౌంట్సీ అండ్ ద క్లెయిమ్ ఆఫ్ ద ఇండియన్ స్టేట్స్ టు బి ఇండిపెండెంట్
* నోట్స్ ఆన్ యాక్ట్స్ అండ్ లాస్
* అన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్
* ఫెడరేషన్ వర్సెస్ ఫ్రీడమ్
* రణడె, గాంధీ అండ్ జిన్నా
* మిస్టర్ గాంధీ అండ్ ద ఎమాన్సిపేషన్ ఆఫ్ ద అన్‌టచబుల్స్
* కమ్యూనల్ డెడ్‌లాక్ అండ్ ఎ వే టు సాల్వ్ ఇట్
* వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ హావ్ డన్ టు ద అన్‌టచబుల్స్
* హూ వర్ ద శూద్రాస్?
* పీజీ సాల్వే రచించిన కమోడిటీ ఎక్స్ఛేంజ్‌కు ముందుమాట
* ద ప్రాబ్లమ్ ఆఫ్ రుపీ: ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్
* హిస్టరీ ఆఫ్ ఇండియన్ కరెన్సీ అండ్ బ్యాంకింగ్
* స్టేట్స్ అండ్ మైనారిటీస్: వాట్ ఆర్ దెయిర్ రైట్స్ అండ్ హౌ టు సెక్యూర్ దెమ్ ఇన్ ద కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా
* ఎమ్‌ఆర్ ఇడ్‌గున్‌జీ రచించిన సోషల్ ఇన్సూరెన్స్ అండ్ ఇండియాకు ముందుమాట
* ద అన్‌టచబుల్స్: హూ వర్ దే అండ్ వై దె బికేమ్ అన్‌టచబుల్స్
* మహారాష్ట్ర యాజ్ ఎ లింగ్విస్టిక్ ప్రావిన్స్ (లింగ్విస్టిక్ ప్రొవిన్సెస్ కమిషన్‌కు సమర్పించిన నివేదిక)
* పాకిస్తాన్ ఆండ్ ద పార్టిషన్ ఆఫ్ ఇండియా
* నోట్ ఆన్ అనెక్జర్ (ఛాప్టర్ 9 : 'వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ..' రెండో ప్రచురణకు ఎ ప్లీ టు ద ఫారినర్ పేరిట చేర్చిన అదనపు ఛాప్టర్)
* కమర్షియల్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా ఇన్ ద మిడిల్ ఏజెస్ ఆర్ ద రైజ్ ఆఫ్ ఇస్లాం అండ్ ద ఎక్స్‌పాన్షన్ ఆఫ్ వెస్టర్న్ యూరప్
* ఇండియా ఆన్ ద ఈవ్ ఆఫ్ క్రౌన్ గవర్న్‌మెంట్
* వెయిటింగ్ ఫర్ ఎ వీసా: ఆటోబయోగ్రఫికల్ నోట్స్
* ద కాన్స్‌స్టిట్యూషన్ ఆఫ్ బ్రిటిష్ ఇండియా
* నోట్స్ ఆన్ పార్లమెంటరీ ప్రొసీజర్
* నోట్స్ ఆన్ హిస్టరీ ఆఫ్ ఇండియా
* ప్రిజర్వేషన్ ఆఫ్ సోషల్ ఆర్డర్ విత్ ద హిందూస్ ఫ్రస్ట్రేషన్
* ద ప్రాబ్లమ్ ఆఫ్ పొలిటికల్ సప్రెషన్
* విచ్ ఈజ్ వర్స్? స్లేవరీ ఆర్ అన్‌టచబులిటీ
* నీడ్ ఫర్ చెక్స్ అండ్ బ్యాలెన్సెస్- భాష పరిస్థితిపై వ్యాసం
* థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్
* బుద్ధ అండ్ హిజ్ ధమ్మ

భారతదేశానికి అంబేద్కర్ అందించిన సేవలు ఎంతో ప్రేరణ కలిగించేవి. ఇప్పటికీ దేశంలోని అనేక పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సంస్థలు ఆయన పేరు మీదుగా నెలకొల్పబడ్డాయి. హంగరీ దేశంలో కూడా మనం దీన్ని గమనించవచ్చు. అమెరికా అధ్యక్షుడు ఒబామా అంబేద్కర్‌ను భారత రాజ్యాంగ పితామహుడిగా పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఎర్నెస్ట్ వాకర్ తన పుస్తకం 'ద ప్రిన్సిపిల్స్ ఆఫ్ సోషల్ అండ్ పొలిటికల్ థియరీ'ని భారత రాజ్యాంగపు ప్రవేశికకు సమర్పించారు.

రాజకీయంగా, రాజ్యాంగపరంగా డాక్టర్ అంబేద్కర్ ముందుచూపు ప్రపంచ తత్వవేత్తలతో సమానమైనదని అంతా అంగీకరిస్తారు. ఆయన భవిష్యత్ దార్శనికతను ప్రపంచంలోనే ఎక్కడా చూడలేము. అందువల్లే ప్రపంచం ఆయనను రాజ్యాంగ పితామహుడిగా, తత్వవేత్తలలో మాస్టర్‌మైండ్‌గా గుర్తించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని భారత రాజ్యాంగం రూపంలో దేశానికి బహుమతిగా ఇచ్చిన మేధావి ఆయన. గొప్ప వ్యక్తులు ఎప్పుడూ తాము చేసిన పనులకు గుర్తింపు ఆశించరు. అంబేద్కర్ కూడా అలాగే రాజ్యాంగ రూపకల్పన గొప్పతనమంతా కమిటీ సభ్యులదే అని పేర్కొనేవారు. అయితే విషాదకరం ఏమిటంటే భారతీయ సమాజం కానీ, విద్యాధికులు కానీ ఆయన చేసిన సేవలను పెద్దగా గుర్తించలేదు. దానికి బదులుగా రాజ్యాంగాన్ని విమర్శించడాన్ని గొప్పగా భావిస్తున్నారు. ఆయన భారతదేశానికి ఒక చట్టబద్ధమైన వ్యవస్థను, ప్రజలకు వారి స్వేచ్ఛకు ఒక పునాదిని ఇచ్చారు. భారతదేశం ఒక స్వతంత్ర దేశంగా రూపొందేందుకు దేశంలోని ప్రతి ఒక్కరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ ఉండాలని ప్రతిపాదించారు. రాజ్యాంగాన్ని మనం అంబేద్కర్ యొక్క ఉత్పత్తిగా భావించవచ్చు. అది పూర్తిగా ఆయన భావజాలానికి ప్రతిరూపంగా రూపుదిద్దుకుంది. రాబోయే తరాల కోసం రాజ్యాంగం






Ambedkar on Stamp

వాటిని మొత్తం రాజ్యాంగ రచనా సభ అంగీకరించడం జరిగింది. ప్రపంచంలోని ఇతర రాజ్యాంగాలను, భారత రాజ్యాంగాన్ని (దీనిలో 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, అనేక భాగాలు ఉన్నాయి) పోల్చి చూసినట్లైతే ఇంతటి భారీ రాజ్యాంగాన్ని పూర్తి చేయడం ఎంతటి కష్టసాధ్యమైన విషయమో తెలుస్తుంది.

అంబేద్కర్‌ను భారత రాజ్యాంపు పితామహుడు/ప్రధాన రూపకర్తగా పేర్కొనవచ్చు. అంబేద్కర్‌తోపాటు డ్రాఫ్టింగ్ కమిటీలోని ఇతర సభ్యులు:

* డాక్టర్ బీఆర్ అంబేద్కర్

* ఎన్ గోపాలస్వామి

* ఎ కృష్ణస్వామి అయ్యర్

* కేఎమ్ మున్షీ

* మొహమ్మద్ సాదుల్లా

* ఎన్ మాధవరావు

* డీపీ ఖైతాన్

భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ ముఖ్యమైన భూమికను పోషించారు. ఆయన తన అనుభవాన్ని, విజ్ఞానాన్నంతా రంగరించి రాజ్యాంగాన్ని రూపొందించారు. దేశపౌరులకు మతస్వేచ్ఛ, అంటరానితనం నిర్మూలన, అన్ని రకాల వివక్ష నిర్మూలనలాంటి అనేక హామీలు లభించి, రాజ్యాంగం ద్వారా వాటికి రక్షణ లభిస్తోంది. ఆయన మహిళల హక్కుల కోసం, వారి సమానత్వం కోసం కూడా తీవ్రంగా కృషి చేశారు. ఎస్సీ, ఎస్టీలకు, ఇతర వెనుకబడిన కులాల వారికి భారతీయ సివిల్ సర్వీసెస్, పాఠశాలలు, కళాశాలల్లో రిజర్వేషన్లు లభించేలా చేసేందుకు రాజ్యాంగ రచనా సభ ఆమోదం పొందారు. తన బృందాన్ని ఆయన ఒక సోషలిజం తరహా ఆదర్శవాదం వైపు నడిపించడంలో కీలకపాత్ర పోషించారు. పార్లమెంట్, విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలలో దళితులకు రిజర్వేషన్లు ఉండాల్సిన అవసరాన్ని గురించి బలంగా నొక్కి చెప్పి, రిజర్వేషన్లు అమలు జరిగేందుకు తీవ్రంగా కృషి చేశారు.

మన రాజ్యాంగంలో పురుషులు, మహిళలు సమాన అవకాశాలు పొందేందుకు అనేక అవకాశాలు సృష్టించబడ్డాయి:

**సామాజిక బానిసత్వ నిర్మూలనకు విద్యే ఆయుధం. విద్య ద్వారానే అణగారిన వర్గాలు ఎదిగివచ్చి వారి సామాజిక హోదా పెరుగుతుంది. వారు ఆర్థికంగా మెరుగై, రాజకీయ స్వేచ్ఛను పొందుతారు - బి.ఆర్. అంబేద్కర్**

* ఆర్టికల్ 14 ప్రకారం, చట్టం ముందు అందరూ సమానమే. చట్టాల ద్వారా అందరికీ సమాన రక్షణ లభిస్తుంది.

* ఆర్టికల్ 15 ప్రకారం లైంగిక వివక్ష ప్రదర్శించడం నేరంగా పరిగణించబడుతుంది.

* ఆర్టికల్ 15 (3) ద్వారా ప్రభుత్వం మహిళలు, పిల్లల విషయంలో సానుకూల వివక్షను ప్రదర్శించే అవకాశం కల్పించారు.

* ఆర్టికల్ 16 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించబడ్డాయి.

రూపంలో ఆయన ఒక కల కన్నారు. డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైనప్పుడు ఆయన తన వ్యక్తిగత ఆందోళలను పక్కనబెట్టి, కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. దేశ పురోగతి కోసం నెహ్రూతో కలిసి పని చేయడానికి ముందుకొచ్చారు.

అనేక ప్రభుత్వ సంస్థలను అంబేద్కర్ పేరుమీదుగా నెలకొల్పడం జరిగింది. నాగ్‌పూర్‌లో అంబేద్కర్ పేరు మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, జలంధర్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని ఆయన పేరుమీదుగానే నెలకొల్పారు. 1920లో అంబేద్కర్ లండన్‌లో విద్యార్థిగా ఉండగా నివసించిన ఇంటిని మహారాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది.

ఆయన తన జీవితాంతం ఎస్సీలు, ఇతర వెనుకబడిన కులాల ఉన్నతి కోసం పోరాడినప్పటికీ, ఆ పోరాటం ద్వారా వారికి అనేక హక్కులు, సాధికారత సమకూరినప్పటికీ వారిలో చాలా మంది పరిస్థితి ఇంకా దయనీయంగానే ఉండడం విషాదకరం.

**రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా అంబేద్కర్:**

భారతదేశం 1947, ఆగస్టు 15న బ్రిటిష్ ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్యం పొందింది. కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. నాటి ప్రధాని నెహ్రూ అంబేద్కర్‌ను మొదటి న్యాయశాఖ మంత్రిగా సేవ చేయాలని ఆహ్వానించారు. అంతే కాకుండా ఆయనను రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నుకొన్నారు. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించడం జరిగి, 1950 జనవరి 26 నుంచి అది అమలులోకి వచ్చింది. రాజ్యాంగ రచనా సభ రాజ్యాంగాన్ని పూర్తి చేయడానికి సుమారు మూడేళ్లు (2 ఏళ్ల, 11 నెలల, 18 రోజులు) సమయం తీసుకుంది.

భారత ప్రజలకు రాజ్యాంగ ముసాయిదాపై చర్చించడానికి దానికి సవరణలు చేయడానికి ఎనిమిది నెలల సమయాన్ని ఇవ్వడం జరిగింది. సుమారు 7635 సవరణలు రాగా, వాటిలో 2473 సవరణలపై చర్చించడం జరిగింది. అన్ని సవరణలనూ అంబేద్కర్ ఒక్కడే పరిశీలించగా,




*ఆర్టికల్ 23 ద్వారా మానవ అక్రమ రవాణాను, వెట్టి చాకిరీని నిషేధించారు.

*ఆర్టికల్ 39 (ఎ), (డి) ప్రభుత్వం జీవనోపాధుల విషయంలో అందరికీ సమానావకాశాలు కల్పించాలని, సమానమైన పనికి సమానమైన వేతనం చెల్లించాలని నిర్దేశించారు.

* ఆర్టికల్ 42 న్యాయమైన, మానవీయ పరిస్థితులు కల్పించాలని, మాతృత్వ సదుపాయాలు కల్పించాలని నిర్దేశిస్తోంది.

*ఆర్టికల్ 51 ఎ (ఇ) ఏ పౌరుడు కూడా మహిళల గౌరవానికి భంగంవాటిల్లే విధంగా ప్రవర్తించరాదనే ప్రాథమిక బాధ్యతను నిర్దేశిస్తుంది.

* ఆర్టికల్ 242 డి (3) ప్రత్యక్ష ఎన్నికలు జరిగే ప్రతి పంచాయితీలో మూడోవంతుకు తక్కువ కాకుండా సీట్లను మహిళల కోసం రిజర్వ్ చేయాలని ప్రతిపాదిస్తుంది. పంచాయితీలోని ఆ సీట్లను రొటేషన్ పద్ధతిలో కేటాయిస్తారు.

*ఆర్టికల్ 243 టి (3) ప్రకారం మున్సిపాలిటీలలోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తారు.

*ఆర్టికల్ 243 టి (4) ప్రకారం చట్టప్రకారం మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్‌ల విషయంలోనూ రాష్ట్ర చట్టసభల్లో మాదిరే ఎస్సీ, ఎస్టీ, మహిళా సభ్యులకు రిజర్వేషన్ కల్పిస్తారు.

ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలు, ఇతర వెనుకబడిన కులాలు రిజర్వేషన్‌లను ఉపయోగించుకుంటూ, విద్య యొక్క అవసరాన్ని గుర్తిస్తూ సామాజికంగా అభివృద్ధి చెందే దశలో ఉన్నారు. అయితే అంబేద్కర్ కృషి వారి అభివృద్ధిని దాటిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేస్తూ, ఆయా వర్గాలలో పేదరికాన్ని దూరం చేయడానికి వారికి సబ్సిడీ అందజేస్తుంటాయి. వారి జీవనోపాధులు, విద్యావకాశాలు కొంచెం మెరుగుపడినప్పటికీ, 69 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా వారింకా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రాజకీయాలలో వారికి రిజర్వేషన్ కల్పిస్తున్నప్పటికీ వారి నుంచి చాలా తక్కువ మంది రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు.

మన దేశంలో ఎస్సీ, ఎస్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్యం పొందిన నాటి నుంచి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా వారి సంక్షేమం కోసం పాటు పడుతోంది.

షెడ్యూల్డ్ కులాల కోసం పథకాలు:

* షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక కోసం ప్రత్యేక కేంద్ర సహాయం

* ఎస్సీ విద్యార్థులకు ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

* ఎస్సీ విద్యార్థులకు ఉచిత కోచింగ్

* తక్కువ అక్షరాస్యత కలిగిన ఎస్సీ బాలికలకు ప్రత్యేక విద్యాభివృద్ధి కార్యక్రమం

* ఎస్సీల కోసం వెంచర్ క్యాపిటల్ ఫండ్

* ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రాజీవ్ గాంధీ జాతీయ ఫెలోషిప్ పథకం

* పాకీపనివాళ్ల పునరావాసం కోసం ప్రత్యేక ఉపాధి పథకం

* 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం కేంద్రబడ్జెట్‌లో ఎస్సీల కోసం రూ.30,859 కోట్లను కేటాయించింది.

* ఎస్సీ యువత కోసం వృత్తివిద్యా శిక్షణా కేంద్రాల ఏర్పాటు

* ఎస్సీ, ఎస్టీలు, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం 'స్టాండప్ ఇండియా' పథకం ప్రారంభించింది. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఈ పథకం కింద బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తారు.

* మహారాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు చెందిన చిన్న, మధ్యతరగతి పారిశ్రామికవేత్తలకు 20శాతం పారిశ్రామిక



| భారత ప్రభుత్వం ప్రకారం పలు విభాగాలు | రిజర్వేషన్ శాతం |
|---|---|
| షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) | 7.5% |
| షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) | 15% |
| ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీలు) | 27% |
| మొత్తం రాజ్యాంగపరంగా నిర్దేశించిన రిజర్వేషన్‌లు | 49.5% |

ప్లాట్‌లను కేటాయించింది. ఈ పథకానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రత్యేక బృంద ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పథకం అని పేరు పెట్టారు.

* ఎస్టీల కోసం ప్రత్యేక పథకాలు

*గిరిజన ఉత్పత్తుల అభివృద్ధి, మార్కెటింగ్‌కు సహకరించేందుకు సంస్థాగత సహకారం

* గిరిజన ప్రాంతాలలో వృత్తివిద్యా శిక్షణా కేంద్రాలు నెలకొల్పడం

*గిరిజనులకు ఆదాయం లభించే కార్యకలాపాలకు సహకారం అందించడానికి NSTFDC/STFDCల ద్వారా సహకారం

* పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ప్రత్యక్ష నగదు బదిలీ; తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రాజీవ్ గాంధీ జాతీయ ఫెలోషిప్ రూపంలో ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు.

*గిరిజన విద్యార్థుల కోసం మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు

* ఎస్టీ బాలబాలికల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత హాస్టళ్లు

* గిరిజన ఉపప్రణాళిక ప్రాంతాలలో ఆశ్రమ పాఠశాలల ఏర్పాటు

*ప్రత్యేక దుర్బల గిరిజన బృందాల (PVTGల) కోసం వివిధ అభివృద్ధి పథకాలు

2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో 20.14 కోట్ల మంది ఎస్సీ కులాల వారున్నారు. ఎస్సీ జనాభాలో తిరిగి 9.79 కోట్ల మంది మహిళలున్నారు.

నేటికీ చాలా పాఠశాలలో ఎస్సీ విద్యార్థుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. దేశంలోని కొన్ని ప్రదేశాలలో ఇతర కులాల పిల్లలు ఎస్సీలు వండిన ఆహారపదార్థాలను భుజించరు. ఉన్నత కులాల పిల్లలు మధ్యాహ్న భోజనం సందర్భంగా ఎస్సీ కులాల పిల్లలతో పాటు కలిసి కూర్చోరు. మధ్యప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలోని పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులను ఇతర విద్యార్థులకు దూరంగా కూర్చోబెట్టి భోజనాన్ని వడ్డిస్తున్నారు. ఇలాంటి కులవివక్ష వల్ల పిల్లలు విద్య నుంచి దూరం చేయబడడమే కాకుండా, చిన్న వయసులోనే వారికి సమాజం పట్ల నిర్వేదం అలవడుతుంది. అంబేద్కర్ తన జీవిత పర్యంతం అణగారిన కులాలు తమ హక్కుల కోసం ఉద్యమించే ముందు విద్యాధికులు కావాలని ఉద్బోధించారు.

నేటికీ మన దేశంలో పాకీపనిని, చచ్చిన జంతువులను తొలగించడం, చెప్పులు కుట్టడం లాంటి అపరిశుభ్రమైన పనులను ఎస్సీలతోనే చేయిస్తున్నారు. పాకీపనివాళ్లు మానవ మలాన్ని తమ చీపుర్లతో ఎత్తి దానిని దూరంగా పారవేయడానికి ఆ బుట్టలను నెత్తిన పెట్టుకుని మోయాల్సి ఉంటుంది. ఇలాంటి పని వివక్షాపూరిత హిందూ సామాజిక నియమాల ఆధారంగా జరుగుతోంది. అంబేద్కర్, "మన దేశంలో ఒక



వ్యక్తి కేవలం తన జన్మ వల్లనే పాకీ పనివాడిగా మారుతున్నాడు తప్ప, తాను చేస్తున్న పని వల్ల కాదు" అన్నాడు.

**మీ బానిసత్వాన్ని మీరే నిర్మూలించుకోవాలి. ఇందు కోసం ఏ దేవుడో, సూపర్‌మ్యాన్ మీదో ఆధారపడవద్దు. ప్రజలు మెజారిటీ వైపు ఉంటే సరిపోదని గుర్తుంచుకోండి. విజయం సాధించడానికి వారు నిరంతరం అప్రమత్తంగా, బలంగా, ఆత్మగౌరవంతో ఉండాలి. మన జీవిత పథాన్ని మనమే నిర్దేశించుకోవాలి – బి.ఆర్.అంబేద్కర్**

ఒక విచారకరమైన విషయం ఏమిటంటే, 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో సుమారు 8 లక్షల మంది సాంప్రదాయంగా పాకీవృత్తిలో ఉన్నారు. తమకు ఎంతో ఇబ్బంది కలిగించే ఈ విషయాన్ని అంగీకరించడానికి ప్రభుత్వాలు ఇప్పటికీ నిరాకరిస్తున్నాయి. జనాభా గణాంకాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో సుమారు 3.2 లక్షల మంది ఇప్పటికీ మానవ వ్యర్థాలను తమ చేతులతో ఎత్తివేసే దుర్భర స్థితిలో కొనసాగుతున్నారు. 1993లో రూపొందించిన పాకీవృత్తి ఉపాధి మరియు పొడి లెట్రిన్ల నిర్మాణం (నిషేధం) చట్టంలో పొడి లెట్రిన్లు నిర్మించు కునేవారికి, పాకీపనివారిని నియమించుకునేవారికి జరిమానాలతో పాటు శిక్షను కూడా ప్రతిపాదించారు. అయితే నేటికీ అనేక మున్సిపాలిటీలు, రైల్వేలు, రక్షణ రంగ ప్రదేశాలలో పాకీవృత్తి కొనసాగుతూనే ఉంది.

దళితులు, ఇతర వెనుకబడిన కులాల వారికి సమాన అవకాశాలు లభించడం కోసం, వారికి సామాజిక న్యాయం లభించడం కోసం అంబేద్కర్ చేసిన కృషి కారణంగా ఆయనను వారు 'మహాపురుషుడు' గా భావిస్తారు. భారత రాజ్యాంగ రూపకల్పనలోను, రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గాను ఆయన వెనుకబడిన కులాలవారి ఉన్నతి కోసం చేసిన కృషి తక్కువేమీ కాదు.

అందరికీ సామాజిక న్యాయం కల్పించేందుకు అంబేద్కర్ చేసిన కృషి భారత చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. తన తోటి పౌరులు, మరీ ప్రత్యేకించి పేదలు, అణగారిన వర్గాల కోసం పోరాడిన ఆయన నిజమైన భారతపుత్రుడు. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ పాత్ర నిస్సందేహంగా చిరస్మరణీయం. ఆయనను మహాపురుషుడిగా, భారత రాజ్యాంగ పితామహుడిగా పిలవడం ఎంతైనా సముచితం.

ఐక్యరాజ్య సమితి అంబేద్కర్ 125వ జయంతి ఉత్సవాలను న్యూయార్క్‌లో ఘనంగా నిర్వహించింది. అణగారిన ప్రజలకు ఆయన నిజమైన ప్రతినిధి అని ప్రస్తుతించింది. ఆయన జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రధాని మోడీ అంబేద్కర్ స్మారక నాణేలను విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో ఆయన జన్మించిన మహోవ్‌లో 'గ్రామ్ ఉదయ్ సే భారత్ ఉదయ్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు సాధికారత చేకూర్చడం ఈ పథకం లక్ష్యం.

దేశవ్యాప్తంగా కోట్లలో ఉన్న అణగారిన వర్గాల వారి కోసం అంబేద్కర్ చేసిన కృషి ఇప్పటికీ వారి జీవితాల్లో ముఖ్యపాత్ర పోషిస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, రాజకీయ నాయకులు మొదలైన వర్గాల వారి జీవితాలను, జీవనోపాధులను ఆయన ఎంతో ప్రభావితం చేశారు. వారి గుండెల్లో ఆయన ఇప్పటికీ ఆరాధ్యుడు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న లక్షలాది మంది ప్రజల జీవితాలను ఆయన ఇప్పటికీ ప్రభావితం చేస్తున్నారు. ఆయన భారతదేశాన్ని ఆధునికత వైపు నడిపారు. అనేక ఇతర దేశాలు కూడా అణగారిన వర్గాల కోసం పని చేయడానికి దారి చూపారు. ఆధునిక, ప్రజాస్వామ్య భారతదేశ ప్రధాన రూపకర్తగా ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. భవిష్యత్ రాజకీయ తరాలకు, సామాజిక విప్లవాలకు ఆయన ప్రేరణ కల్పిస్తూనే ఉంటారు. ✷

## వ్యాపారం

**వ్యక్తిగత**



పిండి గిర్నీ

**సమిష్టి**



ఆరోవిల్లె విలేజ్ యాక్షన్ గ్రూప్ (AVAG) ద్వారా స్పైరులినా (నాచు) పెంపకం

## జీవన తంత్రం

# మారిన మల్లయ్య...



అనగనగా ఒక ఊరిలో మల్లయ్య అనే యువకుడు ఉండేవాడు. అతడు చాలా బద్ధకస్తుడు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా ఏ పని చేయడానికి ఇష్టపడే వాడు కాదు. అలా ఎప్పుడూ ఖాళీగా ఉండటంతో మల్లయ్యను ఊరిలోని వారంతా సోమరిపోతు అని ఎగతాళి చేసేవారు. ఈ మాటలు తల్లిదండ్రుల చెవిన పడ్డాయి. వారు చాలా బాధపడ్డారు. ఎలాగైనా మల్లయ్యను ఏదో ఒక పనిలో పెట్టాలని గట్టిగా నిర్ణయించుకున్నారు.

ఒకరోజు మల్లయ్యను పిలిచి "నువ్వు పని చేయకుండా ఇలా ఎంత కాలం ఉంటావు? మేము ఉన్నంత కాలం ఏదో విధంగా నిన్ను పోషిస్తాం. మేము పెద్దవాళ్ళం. వయసు మీద పడుతోంది. కొంత కాలానికి మేము చనిపోక తప్పదు. ఆ తరువాత నువ్వు ఎలా బతుకుతావు? ప్రతి మనిషీ బతకటానికి ఏదో ఒక పనిచేసుకోవాలి. లేకపోతే బతకలేరు. నువ్వు కూడా ఏదో ఒక పని చేసుకో" అని నచ్చచెప్పారు. తల్లిదండ్రుల ఒత్తిడితో "సరే మీరే చెప్పండి ఏం పని చేయాలో" అని అడిగాడు. 'అడవికి వెళ్ళి కట్టెలు తీసుకురా' అని చెప్పారు అతడి తల్లిదండ్రులు.

మల్లయ్య ఒక రోజు ఉదయాన్నే లేచి కట్టెల కోసం అడవికి వెళ్ళాడు. కొంతసేపు అడవిలో అటూ ఇటూ తిరిగాడు. పని అలవాటు లేని మల్లయ్య ఆలోచించసాగాడు. చల్లటి గాలికి నిద్ర ముంచుకు వచ్చింది. అక్కడే పడుకున్నాడు. కొంత సేపటికి అతడు ఉన్న చోట చెట్టు నీడ పోయి ఎండ వచ్చింది. కానీ మల్లయ్య ఉన్న చోటనే ఉండిపోయాడు. ఎండ వచ్చి మీద పడుతున్నా కూడా అక్కడ నుంచి కదలకుండా బద్ధకంగా ఉండిపోయి 'ఎండను తెచ్చిన సూర్యుడే తిరిగి నీడను ఇవ్వకపోతాడా?' అనుకుంటూ ఎదురు చూశాడు. కొంతసేపటికి ఒక సింహం తన వైపునకు రావడాన్ని గమనించాడు మల్లయ్య. కానీ అప్పుడు కూడా లేవలేదు ఆ బద్ధకస్తుడు. "సింహం నా మీదకు ఎందుకొస్తుంది, పక్క నుంచి పోతుందిలే" అనుకుంటూ ఉండిపోయాడు.

అప్పుడే అటువైపుగా వస్తున్న వేటగాడు... మల్లయ్య మీదకు సింహం రావడాన్ని గమనించాడు. వెంటనే తన వద్దనున్న తుపాకీతో గాలిలోకి కాల్చి సింహాన్ని పారిపోయేట్లు చేసి మల్లయ్యను సింహం బారి నుంచి కాపాడాడు. బుద్ధి తెచ్చుకున్న మల్లయ్య 'ఇంకెప్పుడూ బద్ధకాన్ని దరిచేరనీయకూడదు' అనుకుని వేటగాడికి కృతజ్ఞతలు తెలిపాడు. అలాగే కట్టెలను ఎలా కొట్టాలని అతడినే అడిగి తెలుసుకుని, అడవి నుంచి కట్టెలు తీసుకుని ఇంటికెళ్ళాడు. జరిగింది తల్లిదండ్రులకు చెప్పి తాను ఇక నుంచి అందరిలాగే పని చేసుకుంటానని చెప్పాడు. మల్లయ్యలో వచ్చిన మార్పుకు తల్లిదండ్రులు సంతోషించారు. ✸

## వ్యాపారం

**సామాజిక**



### కర్ణాటకలో 'స్మార్ట్ ఇండియా ప్రై.లి॥' ద్వారా నీళ్ళ ఏటిఎం



### మే 22, అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం

## పుస్తకాలు

క్లాసిక్ పుస్తకం

### అండర్‌స్టాండింగ్ కాస్ట్

**రచయిత:** గోయిల్ ఓమ్‌వెట్




భారతదేశంలో కులం అన్నది శతాబ్దాలుగా ఉనికిలో ఉంది. అది ఒక క్లిష్టమైన సామాజిక వాస్తవం. అనేక మంది విద్యావంతులు కులాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. అయితే చాలా మంది, కొంతవరకు మాత్రమే దానిలో సఫలీకృతులయ్యారు. వ్యవస్థలో భాగంగా కులాన్ని అర్థం చేసుకోవడమన్నది ఒక అధ్యయన కార్యక్రమం. అందుకు విస్తృత పరిశోధన అవసరం. ఈ పుస్తక రచయిత గెయిల్ ఓమ్‌వెట్ ఒక సామాజికవేత్త. ఆమె రెండు దశాబ్దాలకు పైబడిన అనుభవంతో భారతదేశంలో గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, లింగ వివక్షపై పనిచేస్తున్నారు.

ఈ పుస్తకం ప్రస్తుత యుగం ప్రారంభంలో హిందూవాద చరిత్ర గురించి, బుద్ధుని కాలం నుంచి అంబేద్కర్ వరకు కులవ్యవస్థకు వ్యతిరేకంగా బయలుదేరిన ప్రతిఘటనల గురించి వివరిస్తుంది. నిచ్చెనమెట్ల కులవ్యవస్థ ఎలా రూపుదిద్దుకుందీ, వివిధ దశలలో సమాజంపై దాని ప్రభావం గురించి, కులవ్యవస్థ నుంచి స్వేచ్ఛ పొందడానికి అణగారిన వర్గాలు చేసిన పోరాటాన్ని, చరిత్రలో ప్రతి దశలో చోటు చేసుకున్న మార్పులను వివరిస్తుంది. ఈ నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో దళిత దార్శనికత దళిత రాజకీయాలు, కులం అన్న పదాన్ని దాటి ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని, అన్ని అణగారిన వర్గాలకు ప్రతినిధిగా ఉండాల్సిన అవసరాన్నొక్కి చెబుతుంది.

ఈ పుస్తకంలో మహాత్మా జ్యోతీబా పూలే, పెరియార్ ఈవీ రామస్వామి, రామ్‌బాయ్, తారాబాయ్, కబీర్, తుకారాం, అంబేద్కర్‌లాంటి సామాజిక విప్లవవేత్తలు, సంఘసంస్కర్తలు, భక్తి ఉద్యమ పోరాటయోధులు కులవ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన పోరాటం గురించి వివరిస్తుంది. బౌద్ధంలోని కులవ్యతిరేక సూత్రాల గురించి వివరిస్తుంది. దేశంలో కులాన్ని నిర్మూలించి, పౌరులందరికీ స్వేచ్ఛా సమానత్వాలు లభించేలా చేసేందుకు జరిగిన కులవ్యతిరేక పోరాటాల విజయాలు, వైఫల్యాల గురించి దీనిలో చర్చించడం జరిగింది. ఈ పుస్తకంలో దళిత రాజకీయాలు, భారత రాజకీయాల్లో బహుజన్ సమాజ్ పార్టీ (BSP) ఎదుగుదల గురించీ వివరిస్తుంది. దళిత ఉద్యమం గురించి, భారతదేశంలోని కులవ్యవస్థ గురించి అర్థం చేసుకోవాలనుకునేవారికి ఈ పుస్తకం ఒక ఉత్తమ కరదీపిక. *

లేటెస్ట్ పుస్తకం

### ద మేకర్ ఆఫ్ మోడ్రన్ ఇండియా

**రచయిత:** దేశ్‌రాజ్ సిర్వాల్



'డాక్టర్ బీఆర్ అంబేద్కర్: ద మేకర్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అన్న పుస్తకం అంబేద్కర్ తత్వశాస్త్రంలోని వివిధ కోణాలపై జరిగిన 12 పరిశోధనా పత్రాల సంపుటం. ఆధునిక భారతదేశ నిర్మాణంలో అంబేద్కర్ పాత్రను ఈ పుస్తకంలో చర్చించడం జరిగింది. వివిధ రంగాలలో విద్యావేత్తలుగా పని చేస్తున్న ప్రముఖులు ఈ పరిశోధనా పత్రాలను సమర్పించారు. అంబేద్కర్ తత్వశాస్త్రం నేపథ్యంలో గౌరవప్రదమైన మానవ జీవితం కోసం పోరాటం, సమసమాజం, హిందూ సమాజం, మానవుడు మరియు సమాజంపై నూతన ఆలోచనలు, సామాజిక తత్వశాస్త్రం, భారతదేశంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాసమానత్వం మొదలైన అంశాల గురించి ఈ పుస్తకంలో చర్చించారు. అంబేద్కర్ ఒక సామాజిక సంస్కర్తగా దేశంలో ప్రజాస్వామిక హక్కుల కోసం చేసిన పోరాటాన్ని దీనిలో చర్చించడం జరిగింది. అంబేద్కర్ తత్వశాస్త్రంలోని వివిధ కోణాలను, భారత చరిత్రలో ఆయన పాత్రను అర్థం చేసుకోవడానికి ఇది ఒక మంచి పుస్తకం. *

లేటెస్ట్ పుస్తకం

### అంబేద్కర్ ఎన్ ఎకనమిస్ట్ ఎక్స్‌ట్రార్డినేర్

రచయిత: నరేంద్ర జాదవ్




'అంబేద్కర్ ఎన్ ఎకనమిస్ట్ ఎక్స్‌ట్రార్డినేర్' అన్న ఈ పుస్తకం ఒక ఆర్థికవేత్తగా అంబేద్కర్ దేశానికి చేసిన అసాధారణ సేవను గురించి వివరిస్తుంది. మనలో చాలా మందికి న్యాయశాస్త్రం, సామాజిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, మానవ శాస్త్రం, మతాల విశ్లేషణ వంటి వివిధ రంగాలలో అంబేద్కర్ చేసిన సేవ గురించి తెలుసు. కానీ ఒక ఆర్థికవేత్తగా అంబేద్కర్ పాత్రను మన సమాజం పూర్తిగా విస్మరించిందనే చెప్పవచ్చు. భారత ఆర్థిక రంగం, మరీ ప్రత్యేకంగా భారత ఆర్థిక సమస్యలపై అంబేద్కర్ చేసిన కృషిని ఈ పుస్తకంలో చర్చించారు. అంబేద్కర్ మొదట ఒక ఆర్థికవేత్తగా ఎలా శిక్షణ పొందిందీ, ఆయన చేసిన వివిధ ప్రకటనలు, సంభాషణల ద్వారా ఆర్థిక వ్యవస్థపై ఆయన ఆలోచనలను ఈ పుస్తకంలో వివరించారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ యొక్క బహుముఖ నైపుణ్యాలను అర్థం చేసుకునేందుకు, ఆయన కేవలం ఒక సర్వోన్నత మానవ హక్కుల కార్యకర్తే కాదు, ఒక ఉత్తమ ఆర్థికవేత్త కూడా అన్నది అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. *

**ఈ-వనరులు**

| | |
|---|---|
| **విలువ గొలుసు** | – http://www.fao.org/3/a-az114e.pdf |
| **ఉపరంగం** | – http://www.joyhecht.net/mulanje/refs/Kadale-honey-subsector-2005.pdf |
| **ఈ-పుస్తకం** | – https://cppispublications.files.wordpress.com/2016/04/dr-b-r-ambedkar-the-maker-of-modern-india2.pdf |
| **వీడియో** | – https://www.youtube.com/watch?v=z_6sFLBzVN4 |

**అనుబంధాలు**

| | |
|---|---|
| **బృహత్ ప్రయత్నం** | : http://aksharakriti.org/magazines/doc_download/544-jeevanopadhulurte-may-2016 |
| **క్షేత్రం** | : http://aksharakriti.org/magazines/doc_download/543-jeevanopadhulukshetramdeccan-plateu-may-2016 |
| **లైవ్లీహుడ్స్ మేనేజ్‌మెంట్ నోట్స్** | : http://www.aksharakriti.org/magazines/doc_download/541-supplementlivelihoods-management-notesmay-2016 |

**ఈ-కోర్సు**

**ఈ-లైవ్లీహుడ్స్ లెర్నింగ్ కోర్స్ : క్యాప్సుల్ నెం: 278 – 294**

http://www.aksharakriti.org/magazines/doc_download/538-e-coursemay-2016

# 'యోగ'క్షేమం

మే డే శుభాకాంక్షలు!

మాతృత్వ దినోత్సవ శుభాకాంక్షలు! మాతృదేవోభవ!

బుద్ధపూర్ణిమ శుభాకాంక్షలు! బుద్ధం శరణం గచ్ఛామి! ధర్మం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి!

రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ఆయన గీతాంజలిని స్మరించుకుందాం!

ఎక్కడ ఆలోచనలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ప్రవహిస్తాయో

ఎక్కడ గర్వంగా తల ఎత్తుకుని నిలబడగలమో

ఎక్కడ విజ్ఞానం నిరంతరం విస్తృతి చెందే ఆలోచనలు, చేతల వైపు స్వేచ్ఛగా ప్రవహిస్తుందో నా తండ్రీ! ఆ స్వేచ్ఛా స్వర్గం వైపు నా దేశాన్ని నడిపించు.

స్వేచ్ఛగా ఉందాం! బానిస ఆలోచనలు, మాటలు, చేతల నుంచి స్వేచ్ఛను పొందుదాం.

బుద్ధపథంలో యోగ, ధ్యానం చాలా ముఖ్యమైనవి. యోగ వల్ల లాభాలు:

* మన శరీరాన్ని ఎటువడితే అటు వంచడం సులభం
* మన కండరాలు బలపడతాయి
* మనం నిటారుగా ఉండటం సులభం
* కార్టిలేజ్, కీళ్ల వంగకుండా ఉండడాన్ని నివారించవచ్చు
* మన వెన్నెముకను రక్షించుకోవచ్చు
* మన ఎముకలు గట్టిపడతాయి
* మన శరీరం, మరీ ప్రత్యేకించి చేతులు, పాదాల్లో రక్తప్రసరణ మెరుగుపడుతుంది.
* మన శోషరసంలో వ్యర్థాలు తొలగిపోయి, రోగనిరోధక శక్తి పెరగుతుంది.
* గుండె రక్తనాళాల పనితీరు మెరుగుపడుతుంది. గుండె వేగం నెమ్మదిస్తుంది. ఓపిక పెరుగుతుంది. ఎక్కువ ఆక్సిజన్‌ను పీల్చుకోవడం సాధ్యపడుతుంది.
* రక్తపోటు తగ్గుతుంది.
* మన ఎడ్రినల్ గ్రంధులపై నియంత్రణ పెరుగుతుంది
* మనం మరింత సంతోషంగా ఉంటాము.
* మనం ఎక్కువగా కదులుతూ, తక్కువగా భుజిస్తాం
* మన రక్తంలోని చక్కెర శాతం తగ్గుతుంది
* వర్తమానంపై దృష్టి కేంద్రీకరించడానికి, సమన్వయం మెరుగుపరుచుకోనేందుకు, ప్రతిస్పందన సమయం, జ్ఞాపకశక్తి మొదలైన వాటిపై శ్రద్ధ చూపేందుకు తోడ్పడుతుంది.
* మన శరీర వ్యవస్థ రిలాక్స్ అవుతుంది. 'సింపథెటిక్ నెర్వస్ సిస్టమ్' (ఫ్లైట్ లేదా ఫైట్ రెస్పాన్స్) నుంచి ప్రశాంతమైన 'రిస్టోరేటివ్ సింపథెటిక్ నెర్వస్ సిస్టమ్' వైపు మన బ్యాలన్స్ మారుతుంది.
* మన శరీరం ఏం చేస్తుందో మనం స్పష్టంగా గమనించగలం. తద్వారా మన బ్యాలన్స్ పెరుగుతుంది.
* మన నాడీ వ్యవస్థ నిర్వహణ మెరుగుపడుతుంది.
* మన శరీరాంగాలు, నాలిక, కళ్లు, ముఖంలోని కండరాలు, మెడలో టెన్షన్ తగ్గుతుంది.
* మరింత గాఢంగా, మెరుగ్గా నిద్రపోగలం
* రోగనిరోధక వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.
* ఊపిరితిత్తులు మరింత బలపడతాయి. ముక్కు ద్వారానే శ్వాస పీల్చుకోవడం జరుగుతుంది.
* అజీర్తి సమస్యలు దూరం అవుతాయి.
* ఒత్తిడిని పెంచే నిరాశానిస్పృహలు, పశ్చాత్తాపం, కోపం, భయాన్ని మరియు కోరికను తగ్గిస్తుంది.
* మన ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది. కృతజ్ఞత, సహానుభూతి, క్షమ తదితర భావాలు మెరుగుపడతాయి. మనం ఇంకేదో విస్తృతమైన దానిలో భాగమన్న అనుభూతి కలుగుతుంది.
* ఒంటినొప్పులు తగ్గి, మనం మరింత చురుగ్గా తయారవుతాం.
* మన అంతర్గత శక్తి మరింత మెరుగుపడుతుంది.
* మనలో మార్పుపై మనకు అవగాహన, సహానుభూతి పెరుగుతాయి.
* ఇతరులతో సంబంధాలు బలోపేతమవుతాయి.
* సైనస్‌లాంటి వ్యాధులు తగ్గిపోతాయి. శరీరంలోని వ్యర్థాలు తొలగించబడతాయి.
* మెదడు, ఆలోచనల నియంత్రణ ద్వారా మన శరీరాన్ని నియంత్రించుకుని, వ్యాధులను దూరం చేసుకోవచ్చు.
* అలర్జీలు, వైరస్‌లాంటి వాటిని చాలా వరకు దూరం చేసుకోవచ్చు.
* ఇతరులకు సేవ చేయడం ద్వారా జీవితంలో పరమార్థాన్ని వెదుక్కోవచ్చు
* మన పట్ల మనం మరింత జాగ్రత్తలు తీసుకుంటూ, ఇతరుల జీవితాల్లో మార్పు తీసుకువస్తామన్న విశ్వాసాన్ని పెంచుకుంటూ, ఇతరుల్లో విశ్వాసాన్ని పెంచవచ్చు.
* మనుషుల మధ్య సంబంధాలను విశ్వసించడం పెరుగుతుంది. అవిభాజ్యత అనుభవంలోకి వస్తుంది.
* నమ్మకం, విశ్వాసం మెరుగుపడతాయి.

మన ధ్యానం చేస్తాం. ఆసనాలు వేస్తాం. యోగాను చేస్తాం. మనం కోరుకుంటాం. మనం సేచ్ఛను కోరుకుంటాం. మనం మన భాగస్వాములతో, ఈ విశ్వంతో ఐక్యతను కోరుకుంటాం. మనం పరమానందాన్ని కోరుకుంటాం. మన జీవితంలో కలిసి ఉండడంలో, ప్రవహించడంలో, పనులు చేయడంతో, ఆనందాన్ని పొందడంలో ఐక్యతను, జీవితాన్ని అనుభవించడాన్ని కోరుకుంటాం. మనం కలిసి జీవన స్ఫూర్తిని కలిసిమెలిసి అనుభవిద్దాం. ఈ సృష్టి మనలో జీవిస్తుంది. ఇదే యోగ. ఇదే నిజయోగం.

మనం అక్కడికి చేరుకోగలమా? **ఆత్మయోగను అనుసరిస్తే అది సాధ్యమే.** మనం పునరాలోచించుకుంటే! ధ్యానం చేస్తే! మనం అందుకు సిద్ధంగా ఉంటే! మనం దానిని ఆచరిస్తే! ఈ సృష్టి ముందు మోకరిల్లితే! మనం విశ్వసిస్తే! మనం అందుకు సిద్ధంగా ఉంటే! మనం ప్రస్తుతంలో, వర్తమానంలో ఉంటే! చిట్టచివరికి ఎవరైనా ఈ సృష్టిలో ఐక్యం కావడం తథ్యమని కృష్ణుడు చెప్పినట్లు సంజయుడు స్పష్టం చేస్తాడు. అప్పుడు మీకు విజయం, పరిణామం, స్వేచ్ఛ సిద్ధిస్తాయి. అప్పుడు మీకు సంపద, ఆరోగ్యం లభిస్తాయి.

*యత్ర యోగేశ్వర: కృష్ణో యత్ర పార్థో ధనుర్-ధార:*

*తత్ర స్రిర్ విజయో భూతిర్ ధ్రువ నీతిర్ మాతిర్ మమ*

మా యోగ ప్రపంచంలోకి రండి. మనలో ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన పరిస్థితుల కోసం. ఈ సృష్టి ముందు మోకరిల్లడంతో కలిగే పరిణామం, స్వేచ్ఛను పొందడం కోసం – **నరనారాయణయోగసిద్ధి** వైపుకు. అందుకు మీరెన్నడూ చింతించరు.

**–జి. మురళీధర్** ✷



అక్షర లైవ్లీహుడ్స్ ప్రైవేట్ లి॥ జీవనోపాధులు మరియు అభివృద్ధి రంగంలో 6 నెలల ఇంటర్న్‌షిప్‌ల కోసం ఆహ్వానిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు మీ CVలను పంపించగలరు.

ఈ మెయిల్: laxman26@gmail.com

aksharakriti@gmail.com, jeevanopadhulu@gmail.com



జీవనోపాధులు ... భవిష్యత్తు